
సోమవారం 01.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 137 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



జగన్ విధ్వంసాన్ని అధిగమించి, సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. అభివృద్ధి చేసి వచ్చే ఆదాయంతోనే సంక్షేమం కొనసాగాలి. అప్పు చేసి ఖర్చు చేయడం పరిపాలన కాదు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిగా సుదీర్ఘ సుపరిపాలన అందిస్తున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

## చైనాతో సానుకూల సంబంధాలు



**చైనా:** దాదాపు ఏడేళ్ల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ చైనా లో పర్యటిసున్నారు. తియాజింగ్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. దీనికి ముందు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తో మోదీ భేటీ అయ్యారు. అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో వీరి భేటీ ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. గతేడాది రష్యాలోని కజన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో జరిగిన సమావేశం గురించి ఆయన ఇక్కడ ప్రస్తావించారు. నాడు తమ భేటీ ఇరుదేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు బాటలు వేసిందన్నారు. భారత్- చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొందన్నారు. కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైన విషయాన్ని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య మిగతా 2లో...



## గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో గ్రీన్ హైడ్రోజన్ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ మార్గదర్శిగా నిలుస్తోంది. సుమారు 974 కి.మీ. సుదీర్ఘ తీరప్రాంతం, కీలకమైన కృష్ణపట్నం, కాకినాడ వంటి పోర్టులు, అలాగే గోదావరి, కృష్ణా వంటి నదుల జల వనరులు ఆంధ్రప్రదేశ్ సొంతం. ఇవే గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ ఎదగడానికి అనుకూలతలుగా మారుతున్నాయి. ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వివిధ ప్రాజెక్టుల రూపంలో విశాఖపట్నం, కృష్ణపట్నం, కాకినాడ, తిరుపతిలోకి వచ్చాయి. ఇవి పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంటే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనే మార్చేస్తాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రీన్ హైడ్రోజన్ అంటే ఏమిటి?:** నీరులోని హైడ్రోజన్, ఆక్సిజన్ మూలకాలను వేరు చేసి హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియకు సైతం పవన, సౌర విద్యుత్తును ఉపయోగిస్తారు. దీన్ని సౌర, పవన విద్యుత్ ద్వారా ఎలెక్ట్రోలైజర్లలో వేరు చేస్తే, కర్బన్ ఉద్గారాలు లేకుండా ఉత్పత్తి జరుగుతుంది. ఈ విధంగా హైడ్రోజన్, ఆక్సిజన్ వేరు చేస్తారు. ఇదే గ్రీన్ హైడ్రోజన్. దీనిని విద్యుత్, రవాణా, వ్యవసాయం, ఉక్కు, సిమెంట్ రంగాలలో ఉపయోగించవచ్చు.

ఇవన్నీ భారీ కర్బన్ ఉద్గారాలను విడుదల చేసే రంగాలు కావడంతో, గ్రీన్ హైడ్రోజన్ మంచి ప్రత్యామ్నాయం కానుంది. మరోవైపు హైడ్రోజన్‌ని వేరుచేసినప్పుడు వాతావరణంలోకి ఆక్సిజన్ చేరడం వల్ల దాని శాతం పెరుగుతుంది. ఓజోన్ పొర వృద్ధి చెందడానికి, భూగోళం వేడెక్కకుండా కాపాడేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**ఏపీలో ప్రధాన ప్రాజెక్టులు:** విశాఖపట్నం జిల్లా పూడిమడకలో: ఎన్‌టీపీసీ రూ.1.85 లక్షల కోట్లు పెట్టుబడితో భారీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను నిర్మిస్తోంది. గత నవంబరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీని పునాది రాయి వేశారు.

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద: యూకేకు చెందిన యామ్నా కంపెనీ సంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి యూనిట్‌ను రూ.16,000 కోట్లు పెట్టుబడితో ఏర్పాటు చేస్తోంది.

కాకినాడలో: ఏఎం గ్రీన్ అమోనియా ఇండియా సంస్థ సంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల అమోనియా యూనిట్‌తో పాటు 2 గిగావాట్ల ఎలెక్ట్రోలైజర్ ప్రాజెక్టును రూ.12,000 కోట్లు పెట్టుబడితో నిర్మిస్తోంది.

పోలాండ్‌కి చెందిన హైఇన్రా కంపెనీ రూ.35,000కోట్ల పెట్టుబడితో 150కిలో టన్నుల హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమోనియా యూనిట్‌ను నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 10,000 మందిగి ఉపాధి లభించనుంది.

సవాళ్లు కూడా ఉన్నాయి: హైడ్రోజన్ ఉత్పత్తి సులభమే అయినా, ఎలెక్ట్రోలైజర్ల ఖర్చు ఎక్కువ. వీటిలో ప్లాటినం, టైటానియం వంటి అరుదైన లోహాలు ఉపయోగించడం వల్ల కిలోకు రూ.400 వరకూ అవుతోంది. ప్రభుత్వాలు దీన్ని రూ.150-200కి తగ్గించాలన్న లక్ష్యంతో పెద్దఎత్తున పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి. అదే విధంగా హైడ్రోజన్ నిల్వ చేయడం, రవాణా చేయడం చాలా కష్టం. అత్యంత భద్రతా ప్రమాణాలు అవసరం.

ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అనుకూలతలు: తీర ప్రాంతంలో డీసాలినేషన్ టెక్నాలజీతో సముద్ర జలాన్ని తాగునీటిగా మార్చితే పెద్దఎత్తున హైడ్రోజన్ ఉత్పత్తి చేయవచ్చు. సమీపంలోని పోర్టుల ద్వారా దాన్ని మిగతా 2లో...

## మహిళలకు సురక్షితం.. విశాఖ



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల జాబితాలో విశాఖపట్నం చోటు సంపాదించుకుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి, భువనేశ్వర్, కోహిమా, ఐజ్వాల్, గ్యాంగ్‌టక్, ఇటానగర్‌లు కూడా ఆ జాబితాలో వున్నాయి. మహిళలకు రక్షణ లోపించిన నగరాల జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ, కోల్‌కతా, శ్రీనగర్, రాంచి, పాట్నా, జైపూర్, ఫరీదాబాద్ ఉన్నాయి. మహిళల భద్రతపై జాతీయ వార్షిక నివేదిక, సూచీ (నారీ)-2025 ఈ జాబితాలను రూపొందించింది. దేశవ్యాప్తంగా 31 నగరాల్లో 12,770మంది మహిళలను సర్వే చేసి రూపొందించిన ఈ జాతీయ సూచికను గురువారం విడుదల చేశారు. ఈ నివేదిక ప్రాతిపదికన జాతీయ భద్రత 65శాతం వుంది. ఈ ప్రామాణికతలను దృష్టిలో వుంచుకుని నగరాలను 'చాలా ఎక్కువ, ఎక్కువ, తక్కువ, చాలా తక్కువ' అనే కేటగిరీలుగా వర్గీకరించారు. కోహిమా, జాబితాలోని ఇతర టాప్ ర్యాంక్‌లో వున్న నగరాల్లో లింగ సమానత్వం కూడా బలంగా వుంది. పౌర భాగస్వామ్యం, పోలీసింగ్, మహిళలకు అనుకూలమైన రీతిలో మౌలిక సదుపాయాలు వంటి విషయాల్లో కూడా ఈ నగరాలు టాప్‌లో వున్నాయి.

మహిళలకు భద్రత లోపించిన నగరాల విషయానికి వస్తే పాట్నా, జైపూర్ వంటివి చాలా పేలవమైన పనితీరును ప్రదర్శించాయి. వ్యవస్థాగతమైన స్పందనల విషయంలో బలహీనంగా వుండడం, పితృస్వామ్య ధోరణులు ప్రబలంగా వుండడం, పట్టణ మౌలిక సదుపాయాల్లో అంతరాయాలు వంటివి కనిపిస్తున్నాయి. మొత్తమ్మీద, ప్రతి పది మంది మహిళల్లో ఆరుగురు తమ నగరాల్లో సురక్షితంగానే వున్నామని అభిప్రాయపడ్డారు. 40శాతం మంది తాము భద్రతగా లేమని చెప్పారు. రాత్రి వేళల్లో ముఖ్యంగా ప్రభుత్వ రవాణా మార్గాల్లో, వినోద ప్రదేశాల వద్ద భద్రతకు సంబంధించిన అవగాహనలో తీవ్రమైన తగ్గుదల వుందని అధ్యయనంలో వెల్లడైంది. విద్యా సంస్థలు ముఖ్యంగా పగటిపూట 86శాతం మేరకు సురక్షితంగానే వున్నాయి. రాత్రి వేళల్లో లేదా కేంపస్‌కు వెలుపల భద్రత బాగా క్షీణించింది. తాము పని చేస్తున్న ప్రదేశాల్లో మిగతా 2లో...




## తాడిపత్రిలో రణరంగం

- **వినాయక నిమజ్జనం వేళ తాడిపత్రిలో రణరంగం..**
- **భారీగా పోలీసుల మోహరింపు**

**తాడిపత్రి (జర్నలిస్ట్ ఫైల్):** వినాయక నిమజ్జనం వేళ తాడిపత్రి రణరంగంగా మారింది. తెలుగుదేశం పార్టీలో వర్గ విబేధాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి , మరో నేత కాకర్ల రంగనాథ్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నిమజ్జనం సందర్భంగా తాడిపత్రిలో వినాయక శోభాయాత్ర నిర్వహించారు. అయితే ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్ రెడ్డి, కాకర్ల వర్గీయులు ఎదురుపడ్డారు. దీంతో జేసీకి, కాకర్లకు అనుకూలంగా అనుచరులు పరస్పరం నినాదాలు చేసుకున్నారు. మిగతా 2లో...

## క్వాంటం వ్యాలీకి.. రంగం సిద్ధం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలోనే మొట్టమొదటి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ స్థాపనకు రంగం సిద్ధమైంది. అమరావతిలో గ్లోబల్ టెక్ దిగ్గజం ఐబీఎం ఈ కేంద్రాన్ని వచ్చే సంవత్సరం మార్చిలో ప్రారంభించనున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ వెల్లడించారు.

అమరావతి త్వరలో ప్రారంభం కానున్న టెక్ పార్క్‌లో IBM Quantum System–% ని ఏర్పాటు చేయడానికి ఐబీఎం-టీసీఎ కలిసి పని చేయబోతున్నాయి. దీని ద్వారా భారత్ క్వాంటం టెక్నాలజీ రంగంలో ముందంజలో మిగతా 2లో...

## లోకేష్ కు మరో అరుదైన గౌరవం



- **ఆస్ట్రేలియా ప్రభుత్వ స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం కావాలని ప్రత్యేక ఆహ్వానం**
- **ఆహ్వాన లేఖను పంపిన ఆస్ట్రేలియన్ హైకమిషన్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విద్యారంగంలో సంస్కరణల ద్వారా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు శ్రీకారం చుట్టిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్ కు ప్రత్యేక ఆహ్వానం పంపింది. ఈ మేరకు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం.. ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేష్‌ను కోరింది. గత 20 ఏళ్లలో భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమం ద్వారా ఆస్ట్రేలియాలో మిగతా 2లో...

## టీసీఎస్ కొత్త కార్యాలయం రెడీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఒప్పందం కుదుర్చుకున్న ఐటీ కంపెనీ టీసీఎస్. రూ.1370 కోట్ల పెట్టుబడితో 12,000 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు టీసీఎస్ ముందుకొచ్చింది. కేటాయించిన భవనాల్లో 100 రోజుల్లో కార్యకలాపాలు ప్రారంభిస్తామని మంత్రి లోకేష్ చెప్పినట్టుగానే, టీసీఎస్ ఇప్పుడు కార్యకలాపాలు మొదలుపెట్టేందుకు సిద్ధమైంది. విశాఖపట్నం మధురవాడ ఐటీ సెజ్‌లో టీసీఎస్ కార్యాలయం సెప్టెంబర్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుంది. మిగతా 2లో...

## పింఛన్ల నిధులు విడుదల

- **ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీకి నిధులు విడుదల చేసిన ప్రభుత్వం - రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**
- **63,61,380 మంది లబ్ధిదారులకు పెన్షన్ ల పంపిణీకి రూ. 2,746.52 కోట్లు విడుదల**
- **కొత్తగా మంజూరైన 7,872 మంది స్పౌజ్ పెన్షన్ ల పంపిణీ**
- **స్పౌజ్ పెన్షన్ ల కోసం అదనంగా రూ 3.15 కోట్లు విడుదల**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** 31 ఆగస్టు 2025: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీర్ భరోసా పెన్షన్ పథకం కింద సెప్టెంబర్ ఒకటవ తేదీన 63,61,380 మంది లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేసేందుకు రూ. 2,746.52 కోట్లు గ్రామ, వార్డు సచివాలయాలకు విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా మంజూరైన 7,872 మంది స్పౌజ్ పెన్షన్ లబ్ధిదారులకు మిగతా 2లో...

## వైసిపి మాటలు హాస్యాస్పదం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు న్యాయం చేయడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వైసిపి నేతలు శాంతిభద్రతల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సొంత తల్లి, చెల్లి, కుటుంబ సభ్యులకు రక్షణ లేక రాష్ట్రం వదిలిపోయారని పేర్కొన్నారు. సొంత పార్టీ ఎంపి కుటుంబాన్ని కిడ్నాప్ చేసి 48 గంటలు దాచిన చరిత్ర అని విమర్శించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, పేర్ని నాని వంటి వైసిపి నాయకుల మిగతా 2లో...

## శ్రీశైలం 8 గేట్లు ఎత్తివేత



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):** ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షానికి తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఏపీ, తెలంగాణలోని ప్రాజెక్టుల్లో జలకళ సంతరించుకుంది. అయితే శ్రీశైలం ప్రాజెక్టుకు ఆదివారం ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగింది. ఈమేరకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు 8 గేట్లు ఎత్తి దిగువకు మిగతా 2లో...


## 18 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం కారయ్యింది. సెప్టెంబర్ 18 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నట్లు తెలుస్తోంది. 10 రోజులపాటు ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సెప్టెంబర్ 4న జరిగే కేబినెట్ భేటీలో.. అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ విషయాన్నీ గత నెలలలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించిన విషయం తెలిసిందే కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై అసెంబ్లీ సమావేశాల్లో విశేష చర్చ జరిగే అవకాశముంది. రాష్ట్రంలోని ముఖ్యమైన అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా అసెంబ్లీలో ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో బనకచర్ల ప్రాజెక్టు అంశం పై ప్రత్యేకంగా చర్చించే యోచన ఉన్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరం పూర్తయిన సందర్భంగా.. పాలనపై సమగ్రంగా చర్చ జరగనుంది

# చైనాతో సానుకూల సంబంధాలు

(మొదటి పేజీ తరువాయి)



నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇరుదేశాల మధ్య సహకారంతో దాదాపు 2.8 బిలియన్ల మంది ప్రజల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు.
పరస్పర విశ్వాసం, గౌరవంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు ముందుకు తీసుకెళ్లేందుకు నిశ్చయించుకున్నామన్నారు. ఈ సందర్భంగా చైనాలో పర్యటించేందుకు, ఎస్‌సీవో సదస్సుకు తనను ఆహ్వానించినందుకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.
ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించే అంశంపై సైనిక, దౌత్యాధికారుల మధ్య పలు దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ట్రంప్ సుంకాలను ఖండించిన డ్రాగన్.. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది.

**డ్రాగన్, ఏనుగు ఒక్కటవ్వాలి.. భారత్- చైనా సంబంధాలపై జిన్‌పింగ్**

షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు కోసం భారత ప్రధాని మోదీ చైనాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాలపై మాట్లాడారు. ఈ క్రమంలో జిన్‌పింగ్ మాట్లాడుతూ.. భారత్– చైనా స్నేహంగా ఉండటం సరైన నిర్ణయమన్నారు.
ప్రధాని మోదీని మరోసారి కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందంటూ.. ఎస్‌సీవో సదస్సుకు జిన్‌పింగ్ ఆహ్వానం పలికారు. గతేడాది కజన్‌లో ఇరువురి నేతల మధ్య జరిగిన భేటీని జిన్‌పింగ్ గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలు.. గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులని పేర్కొన్నారు. ఇరు దేశాల్లోని ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంబంధాల పునరుద్ధరణ బాధ్యతను తాము భుజాన వేసుకున్నామన్నారు. పొరుగు దేశాలుగా తమ మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల విజయాలకు దోహదపడే అంశాల్లో.. డ్రాగన్, ఏనుగు కలిసి రావడం సరైన ఎంపికన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షికంగా స్థిర, దృఢమైన సంబంధాలు దీర్ఘకాలం కొనసాగేలా చూసుకోవాలన్నారు. ప్రపంచంలో శాంతి, శ్రేయస్సు కోసం భారత్–చైనాలు బాధ్యతను తీసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.
అంతకు ముందు ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. ఇరుదేశాల సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొన్నాయని, కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైందని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇరుదేశాల మధ్య సహకారంతో దాదాపు 2.8 బిలియన్ల మంది ప్రజల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు.

# గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. రాష్ట్రంలోని పోర్టులు, తీర ప్రాంతం, నీటి వనరులు, పునరుత్పాదక శక్తి ఇలా ఎన్నో అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా నిలబెట్టనున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
ముందుంది మంచికాలం: ఇప్పటికే పునాది పడిన ఈ ప్రాజెక్టులు విజయవంతమైతే, ఆంధ్రప్రదేశ్ జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్లో ముందంజలో ఉండటమే కాకుండా, అంతర్జాతీయ ఎగుమతి కేంద్రంగా కూడా ఎదుగుతుంది. ముఖ్యంగా ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాలకు ఇది శాశ్వత ప్రత్యామ్నాయం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ ప్రయాణం కేవలం ఎనర్జీ రంగాన్ని మాత్రమే కాకుండా రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తును మలుపుతిప్పే శక్తిగా మారబోతోంది.

# తాడిపత్రిలో రణరంగం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమయంలో రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు తాడిపత్రిలో భారీగా మోహరించారు. టీడీపీలోనే ఇరు వర్గాలు ఘర్షణకు దిగడంతో టెన్షన్ వాతావరణం కొనసాగుతోంది.

# టీసీఎస్ కొత్త కార్యాలయం రెడీ

(మొదటి పేజీ తరువాయి)

హిల్ నం–3లోని మిలీనియం టవర్స్‌లో టీసీఎస్ నేమ్ బోర్డు ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఉద్యోగ నియామకాలు కూడా ప్రారంభమ య్యాయి. శాశ్వత కార్యాలయం సిద్ధం అయ్యే వరకు బీ బ్లాక్ మొత్తం, అలాగే ఏ బ్లాక్‌లోని 4 నుండి 7వ అంతస్తులు టీసీఎస్ కార్యకలాపాల కోసం ఉపయోగించుకోనుంది.

# వైసిపి మాటలు హాస్యాస్పదం

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ జీవతం ఎప్పుడో ముగిసిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ తీసుకురాలేని వైసిపి నేత కూడా మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడమే వారి రోజువారీ కార్యక్రమం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మహిళలకు సురక్షితం.. విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

లైంగిక వేధింపుల నివారణ విధానం (పిఓఎస్‌హెచ్ పాలసీ) వుందో లేదో దాదాపు 45శాతం మందికి తెలియదు. భద్రతకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు వస్తే వాటిపై అధికారులు సమర్థవంతంగా వ్యవహరిస్తారన్న నమ్మకమైతే వుందని కేవలం నాలుగోవంతు మంది మహిళలే చెప్పారు. ప్రస్తుత భద్రతా చర్యలు కొంతవరకు బానే వున్నాయని 69శాతం మంది చెప్పారు. చాలా లోపాలు, వైఫల్యాలు వున్నాయని 30శాతం మందికి పైగా చెప్పారు. పొరుగు వారినుండి ఎదురయ్యే వేధింపులు 38శాతం కాగా, ప్రజా రవాణాలో 29శాతం మేరకు వేధింపులు తలెత్తుతున్నాయి. ప్రతి ముగ్గురిలో ఒక్కరే వీటిపై నోరు విప్పుతున్నారు. అందువల్ల నేరాలకు సంబంధించిన అధికార డేటా వల్ల మహిళల వాస్తవ జీవన పరిస్థితులు తెలియవని నివేదిక స్పష్టం చేసింది.
నివేదికను విడుదల చేస్తూ జాతీయ మహిళా ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్, భద్రతను కేవలం శాంతి భద్రతల అంశంగా చూడలేమని అది మహిళల జీవితంలోని ప్రతీ అంశాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. ఒక మహిళ విద్య, ఆరోగ్యం, పని అవకాశాలు, లేదా స్వేచ్ఛగా రాకపోకలు ఇవన్నీ మార్పు చెందుతాయన్నారు. భారత్ సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలంటే మహిళలకు సురక్షితమైన, భద్రత కలిగిన వాతావరణం నెలకొని వుండడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. మహిళల భద్రత నాలుగు కోణాల్లో %–% భౌతిక, మానసిక, ఆర్థిక, డిజిటల్ రూపంలో – వుంటుందని చెప్పారు. మహిళల భద్రత విషయంలో సమాజానికి కూడా బృహత్తర బాధ్యత వుంటుందని, సమాజం కూడా అది గుర్తించాలని అన్నారు.

# మట్టిపాత్రలకు మళ్లీ ఆదరణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వృత్తి నైపుణ్యాల పెంపు ద్వారా ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు పడేలా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సన్నద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో వృత్తి పనివారికి శిక్షణతోపాటు వ్యాపార అవకాశాలకు తోడ్పాటు అందించనున్నారు. ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో మట్టి పాత్రలకు మళ్లీ ఆదరణ లభిస్తోంది. మారుతున్న అవసరాలను పరిగణనలోకి తీసుకుని మట్టిపాత్రల తయారీకి సాంకేతికతను జోడించి విద్యుత్?తో నడిచే చక్రాన్ని (పోర్టర్ వీల్) కుమ్మర్లకు ఉచితంగా ఇస్తారు. ఆకట్టుకునేలా వివిధ పాత్రల తయారీకి పది రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.
అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా మట్టి పాత్రల తయారీపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలను ఇప్పటికే గుర్తించారు. నర్సీపట్నం మండలంలోని వేములపూడి ఖాదీ సొసైటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల్లో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. తొలి విడతలో 120 మందిని ఎంపిక చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.
ఎగ్జిబిషన్లలో విక్రయాలు : ఇప్పటివరకు కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వారికే ఉపకరణాలను ఉచితంగా ఇచ్చేవారు. ఈ ఏడాది నుంచి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారికీ ఇవ్వాలని నిర్ణయించారు. మంజూరైన వాటిలో 80 కుమ్మర్లకు, 20 ఎస్సీలకు, 20 ఎస్టీలకు ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వారు తయారు చేసిన వస్తువులు కేవీఐసీ విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో విక్రయించేలా అవకాశం కల్పిస్తారు.
అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలోని గిరిజనులకు నాలుగు వందల తేనెపెట్టెలను ఉచితంగా ఇవ్వనున్నారు. వీటితోపాటు తేనెటీగలనూ పంపిణీ చేస్తారు. ఒక్కో లబ్ధిదారుకు పది పెట్టెలు ఇస్తారు. ఈ ప్రాజెక్టుకు రూ.20 లక్షలు కేటాయించారు. శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రాంతంలో 20 మంది ప్లంబర్లకు ఉచితంగా పరికరాలు అందజేయనున్నారు.
బలోపేతం చేయడమే లక్ష్యం : వృత్తి పనులను బలోపేతం చేయడం ద్వారా పేదరిక నిర్మూలనే లక్ష్యమని విశాఖపట్నం గ్రామోద్యోగ వికాస్ యోజన నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శిక్షణ ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయని వివరిస్తున్నారు. తద్వారా వారంతా ఆర్థిక స్వావలంబన సాధిస్తారని నోడల్? అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వృత్తి పనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారానూ 35 శాతం గ్రాంట్?తో రుణాలు పొందవచ్చని ఆయన వెల్లడించారు. బియ్యం మిల్లులు, టెంట్?హౌస్?లు, జీడి ఆధార పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు.
మరోవైపు విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెంచి ఉపాధికి బాటలు వేసేలా కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలు చేస్తున్న ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం సత్ఫలితాలనిస్తోందని నిపుణులు తెలుపుతున్నారు. ఈ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో వివిధ అంశాల్లో శిక్షణ, క్షేత్ర పరిశీలనకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# దళారుల పెత్తనానికి చెక్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కూరగాయల ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. వాటిని పండించే రైతుకు ఇటు కొనుగోలు చేసే వినియోగదారుడికి ధరలను నిర్ణయించే అవకాశం లేదు. అంతా దళారుల పెత్తనమే కొనసాగుతోంది. అన్నదాతకు లాభసాటి ధర వచ్చేలా వాటిని కొనుగోలు చేసే ప్రజలపై అంతగా భారం పడకుండా రైతు బజార్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలోనూ రైతు బజారు ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాలని ఇటీవల మార్కెటింగ్ శాఖకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.
ప్రస్తుత కలెక్టర్ చొరవతో : తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం, రావులపాలెం, కొత్తపేట, మండపేటలో మాత్రమే రైతు బజార్లు ఉన్నాయి. అమలాపురంలో గతంలో రైతు బజారు ఏర్పాటు చేసినా దళారుల ప్రభావంతో కొనసాగలేదు. ప్రస్తుత కలెక్టర్ చొరవతో ఏడాది నుంచి కొంత వం–కు దుకాణాలు నడుస్తున్నాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ, రామచంద్రపురం పురపాలక సంఘం, రాజోలు, పి.గన్నవరంలలో రైతు బజార్లు లేవు. ముమ్మిడివరంలో ఏర్పాటుకు 2018లో అప్పటి తెలుగు దేశం పార్టీ నాయకత్వంలో ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తే తర్వాత వచ్చిన వైఎస్సార్సీపీ నాయకులు పట్టించుకోలేదు.
దళారుల ఇష్టారాజ్యంగా ధరలు : ముమ్మిడివరం, అయినవిల్లి, పి.గన్నవరం, రాజోలు, ఐ.పోలవరం, కె.గంగవరం, రావులపాలెం, కొత్తపేట, కపిలేశ్వరపురం మండలాల్లోని లంక గ్రామాలల్లో 6,500 హెక్టార్లలో రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. వీటి ద్వారా రోజువారీ బెండ, వంగ, పచ్చిమిర్చి, ఆనబ, మునగ, అరటి, టమోటా, చిక్కుడు, గుమ్మడి, ఆకుకూరల పంటలు రోజువారీ వేల టన్నులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడ దళారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి తక్కువకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.
మార్కెటింగ్ శాఖకు అందుబాటులో షెడ్లు : రైతు బజార్ల ఏర్పాటు ద్వారా ప్రజలు, రైతులకు ప్రయోజనం కలుగుతుందని మార్కెటింగ్ శాఖ ఏడీ విశాలాక్షి తెలుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలోనూ రైతు బజారు ఏర్పాటు చేయాలని సూచించడంతో ఆ మేరకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. దీనికి అనుకూలంగా ఉన్న స్థలాలను పరిశీలిస్తున్నట్లు మార్కెటింగ్? ఏడీ వివరించారు. ముమ్మిడివరంలో మార్కెటింగ్ శాఖకు చెందిన షెడ్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.
ఏళ్లు గడుస్తున్నా రైతులు, ప్రజల కష్టం కళ్లకు కడుతున్నా వీటిల్లో మార్పు రావడం లేదు. వ్యవసాయోత్పత్తుల ధరలపై సరైన నియంత్రణ రైతులు చేతిలో ఉండటం లేదు. ఎలాగో పెట్టుబడి సమకూర్చుకుని అనేక విధాలా శ్రమకోర్చి కూరగాయలను సాగు చేస్తున్న అన్నదాతలకు ఎటువంటి లాభాలు చేకూరడం లేదు. కూరగాయలు, పండ్ల కోసం జనం ధారపోస్తున్న డబ్బులో మూడో వంతు మాత్రమే కర్షకుల వరకు చేరుతున్న పరిస్థితి ఉంది. మిగిలిన సొమ్మంతా ట్రేడర్లు, హోల్‌సేలర్లు, రీటైలర్ల వాటాలుగా ఉన్నాయి. అవి కూడా ఛార్జీలకే చెల్లిపోతున్నట్లు గతంలోనే ఆర్‌బీఐ నిపుణుల నివేదికలో వెల్లడైంది.

## యువతకు అడ్వెంచర్ - వినోదాల పసందుగా “గోదావరి మహా పుష్కరవనం

**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్):** చుట్టూ పచ్చని వనాలు, పక్షుల కిలకిలలు, ఆహ్లాద గాలులు, యువతకు సాహస క్రీడలు, అడవిని తలపించే మహా వృక్షాలు, విజ్ఞానం, వినోదాలు పంచే విధంగా రాజమహేంద్రవరంలోని దివాన్‌చెరువు అభయారణ్యంలో 250 ఎకరాల్లోని ‘గోదావరి మహా పుష్కరవనం’ నూతన శోభతో వెల్లివిరుస్తోంది. 2015లో గోదావరి పుష్కరాల గుర్తుగా అప్పటి సీఎం చంద్రబాబు దీన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉద్యానంలో బర్మా బ్రిడ్జి, స్టార్ నెట్, కమాండో నెట్, సాహస కాంబో వంటి క్రీడలు ఉన్నాయి.
ప్రత్యేకతలు: ఈ ప్రాంతంలో యువతకు అడ్వెంచర్ బైక్ రైడింగ్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఇందులో 150, 200 సీసీలతో 5 బైక్‌లు సమకూర్చారు. వీటి కోసం దాదాపు 2 కిలోమీటర్ల మేర ట్రాక్?ను ఏర్పాటు చేశారు. సుమారు 20 రకాల పరికరాలతో పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఓపెన్ జిమ్‌ల్లో పాల్గొనేందుకు అన్ని విధాలుగా సౌకర్యాలను కల్పించారు. వీటితో పాటు చింత చెట్లతో వనాన్ని వినూత్నంగా తీర్చిదిద్దారు. సందర్శకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. దాదాపు 100 మంది పర్యాటకులు



కూర్చునేందుకు యాంపీ థియేటర్ అందుబాటులోకి తీసుకొచ్చారు.
సీతాకోక చిలుక ఉద్యానం: దాదాపు 25 రకాల సీతాకోక చిలుకలు ఇక్కడ కనువిందు చేస్తాయి. విదార్థుల విజ్ఞానం కోసం సుమారు 75 రకాల రీసెర్చ్ ప్లాంట్స్ ఉన్నాయి. సముద్ర జంతువుల అవశేషాలతో కోరింగ మెరైన్ మ్యూజియం ఉంది. అందరికీ అందుబాటులో ఉండే విధంగా వర్చువల్ సఫారీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అటవీ రేంజ్ అధికారి దావీదురాజు అన్నారు. ఏఆర్ గ్లాసెస్ ధరించి, చూస్తే జంతువుల మధ్యలో నుంచి అడవిలో వెళ్తున్న అనుభూతి కలుగుతుందని ఆయన తెలిపారు. ఫొటోషూట్ల కోసం పుష్కరవనంలో 15 సెల్ఫీ పాయింట్లు, దుస్తులను మార్చుకునేందుకు 6 గదులను ఏర్పాటు చేయనున్నామని ఈ సందర్భంగా దావీదురాజు వెల్లడించారు.
గతేడాది సందర్శనకు సుమారు 66,000 మంది సందర్శకులు వచ్చారని డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది ఆ సంఖ్యను లక్షకు పెంచాలని నిర్ణయించుకున్నామని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పెద్దవారికి ప్రవేశ రుసుం టికెట్ రూ.40గా నిర్ణయించారు. బృందంగా ఏర్పడి వచ్చే విద్యార్థులకు రాయితీ ఇస్తున్నామని ఆయన అన్నారు.
గోదావరి నదీ తీరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దే క్రమంలో రివర్ ఫ్రంట్ విస్తరించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా నగరపాలక సంస్థ గతంలో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా పక్కన పెట్టేసింది. కమిషనర్ విజయరామరాజు హయాంలో ఈ ప్రాజెక్టును తెరమీదకు తీసుకొచ్చారు. గోదావరి గట్టును విస్తరించడం, ట్యాంకు బండ్ రోడ్డును పర్యాటకంగా అందంగా తీర్చిదిద్దడం ద్వారా చారిత్రక నగరంలో పర్యాటక అభివృద్ధిని చేయగలమని భావించారు.

# అనంతపురం కొండల్లో కార్లు, బైక్ రేసింగ్ పోటీలు

**అనంతపురం(జర్నలిస్ట్ ఫైల్):** అనంతపురం జిల్లాలో జరుగుతున్న కార్లు, బైక్ రేసింగ్ పోటీలు ఆకట్టుకుంటున్నాయి. ‘దక్షిణ డేర్ క్రాస్ కంట్రీ ర్యాలీ అండ్ బైక్ రేస్’ పేరిట నిర్వహిస్తున్న పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. 4 రోజుల పోటీల్లో భాగంగా 3వ రోజైన నేడు విన్యాసాలను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఏపీ, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన రేసర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. రేసింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.
ఆకట్టుకుంటున్న పోటీలు : అనంతపురం జిల్లా శింగనమల, నార్పల మండలాల పరిధిలో చేపట్టిన మోటార్‌బైక్, కారు రేసింగ్ పోటీలు ఆకట్టుకుంటున్నాయి. ‘దక్షిణ డేర్ క్రాస్ కంట్రీ ర్యాలీ అండ్ బైక్ రేస్’ పేరిట బెంగళూరుకు చెందిన మోటార్స్ స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ రేసింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తుండగా మూడోరోజైన ఇవాళ డర్ట్ బైక్‌లు, కార్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శింగనమల మండలం మరవకొమ్మ క్రాస్ వద్ద గాలిమరలకు వెళ్లే దారిలో ఈ రేసులను నిర్వహిస్తున్నారు.
భారీగా తరలివచ్చిన ప్రజలు : కొండ ప్రాంతాల్లో జరుగుతున్న రేసింగ్‌ను, రైడర్లు, డ్రైవర్ల



విన్యాసాలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, యువత తరలివచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గోవా, తమిళనాడు, కేరళ, కర్ణాటక సహా ఇతర రాష్ట్రాలకు చెందిన రేసర్లు రేసులో పాల్గొంటున్నారు. 4 రోజులపాటు పోటీలు నిర్వహించేందుకు అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ అనుమతులు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.
రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు : మరోవైపు పల్నాడు జిల్లా చిలకలూరిపేట సీ.ఆర్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. రాష్ట్రస్థాయి క్యారమ్స్, చెస్, షటిల్ పోటీల నిర్వహణ ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారుల్ని దేశానికి పరిచయం చేస్తుందన్నారు. క్యారమ్స్‌లో జాతీయస్థాయిలో విజయం సాధించిన జనార్థన్‌రెడ్డి, కుసుమ సమీరలను ఆయన సత్కరించారు. సీఎం చంద్రబాబు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.
సండే ఆన్ సైక్లింగ్ కార్యక్రమం : ఫిట్ ఇండియాలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లావ్యాప్తంగా సండే ఆన్ సైక్లింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సండే ఆన్ సైక్లింగ్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రారంభించారు. కళాశాల మైదానం నుంచి 6 కిలోమీటర్ల మేర సైక్లింగ్ చేశారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువత, పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. సైక్లింగ్ చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణకు అవకాశం ఉంటుందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ప్రతి ఆదివారం సైక్లింగ్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

# లోకేష్ కు మరో అరుదైన గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించారని, 2001లో ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కూడా స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగస్వాములయ్యారని వెల్లడించింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆస్ట్రేలియాలోని కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ముఖ్యంగా విద్యారంగం, నైపుణ్యాలు, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుంది.

# క్వాంటం వ్యాలీకి.. రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఐబీఎంకు అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, కెనడా, స్పెయిన్‌లలో తొమ్మిది సెంటర్లు ఉన్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఆ జాబితాలో చేరబోతోంది. దీంతో అమరావతి కేవలం రాజధానిగా కాకుండా, భవిష్యత్తులో క్వాంటం టెక్నాలజీకి ప్రధాన హబ్‌గా మారబోతోందన్న అంచనాలు పెరిగాయి. గత సంవత్సరం సీఎం చంద్రబాబు నాయుడు “క్వాంటం వ్యాలీ” ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందుకోసం అమరావతిలో 50 ఎకరాల స్థలాన్ని కేటాయించి, హైదరాబాద్‌లోని హైటెక్ సిట తరహాలో ఒక ప్రత్యేక భవనం నిర్మించేందుకు ప్రణాళికలు వేశారు. ఈ ప్రాజెక్టులో టీసీఎస్ , ఎల్ అండ్ టీ ఇప్పటికే భాగస్వాములు కాగా, ఇప్పుడు ఐబీఎం కూడా చేరడం ప్రత్యేకంగా నిలిచింది. రాష్ట్ర జీడీపీ పెంపుతో పాటు నాలెడ్జ్ ఎకానమీపై దృష్టి సారించిన సీఎం చంద్రబాబు, తెలుగు యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించేందుకు పలు ఆధునిక టెక్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా, అమరావతిని హైటెక్ టెక్నాలజీల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ఇక మార్చిలో ప్రారంభం కానున్న ఐబీఎం ప్రాజెక్ట్‌తో అమరావతిపై పెట్టుబడిదారుల ఆసక్తి మరింత పెరిగిందని విశ్లేషకులు అంటున్నారు. ఇది కేవలం రాష్ట్రానికే కాకుండా, భారత్ టెక్నాలజీ భవిష్యత్తుకి కూడా కీలక మలుపు అవుతుంది. ఐబీఎం ప్రకటనతో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయని భావిస్తున్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ స్థాపనతో, దేశంలోనే తొలి అడ్వాన్స్‌డ్ టెక్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు తెచ్చుకోబోతోంది.

# పింఛన్ల నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సెప్టెంబర్ 1న పెన్షన్ పంపిణీ చేయడానికి రూ. 3.15 కోట్లు కూడా విడుదలచేశామని మంత్రి చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి పింఛన్ల కోసం రూ. 32,143 కోట్లు బడ్జెట్ కేటాయించగా, ఇందులో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2025 వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీకి రూ. 16,366.80 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ కోసం రూ. 10,000 కోట్లకు మించి కేటాయించడం లేదని తెలియజేశారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా, లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ అందించడం తోపాటు వారి జియో–కోఆర్డినేట్స్‌ను కూడా నమోదు చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు వంటి నిరుపేద, నిస్సహాయ వర్గాల కష్టాలను తొలగించడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని ఒక ముఖ్యమైన సంక్షేమ పథకంగా అమలు చేస్తోందని అన్నారు. దేశంలో సామాజిక భద్రతా పెన్షన్ కోసం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు.

# శ్రీశైలం 8 గేట్లు ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

2,16,520 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇన్ ఫ్లో 3.40 లక్షల క్యూసెక్కులు కాగా ఔట్ ఫ్లో 3.12 లక్షల క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,624 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.80 అడుగుల వరకు నీరు ఉంది. ఇక ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203 టీఎంసీలుగా ఉంది.

# నేత్రదానంతో మరొకరికి కొత్త జీవితం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి కొత్త జీవితం అందించవచ్చు అని, మరణాంతరం వారి నేత్రాలను దానం చేసేలా తోటి వారిని ప్రోత్సహించాలని గుంటూరు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ దేవిరెడ్డి కిరణమై అన్నారు. భారత ప్రభుత్వము, కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్, గుంటూరు అనుబంధ సంస్థ జన చైతన్య సమితి ఆధ్వర్యంలో 40వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల గోడ పత్రికలను గుంటూరులో ఆదివారం ఆవిష్కరించారు.
ఈసందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ ఆగష్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ ఎనిమిదవ తేదీ వరకు జరగుతున్న నేత్ర దాన పక్షోత్సవాల సందర్భముగా నేత్రదానం, అంధత్వంపై అవగాహన నిర్వహించడంతో పాటు కంటి సమస్యలు రాకుండా ప్రజలను చైతన్య పర్చటమే లక్ష్యంగా జన చైతన్య సమితి బృందం ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో విస్తృత స్థాయిలో నేత్రాలపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయని జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వె లితోటి అనిల్ కుమార్ అన్నారు. జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు మాట్లాడుతూ మరణాంతరం తమ నేత్రాలను దానం చేసినచో నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్న వారికి తిరిగి మరల కంటిచూపును ప్రసాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సహృదయ సేవా సంఘం అధ్యక్షులు రవీంద్ర, నవ చైతన్య సంఘం అధ్యక్షులు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు

# క్లాస్‌గా కనపడినా.. మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్

## సభలో సంతాపం ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపట్టిన సిఎం రేవంత్‌రెడ్డి

### ఆదివారం ఉదయం 9 గంటలకు శాసనసభ వాయిదా : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ చూడటానికి క్లాస్‌గా కనిపించినా మాస్‌లీడర్ అని, నాకు మంచి మిత్రుడని విద్యార్థి నాయకుడిగా ప్రజాప్రతినిధిగా, నిర్మాతగా ఆయన రాణించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అసెంబ్లీ సమావేశం తొలిరోజున శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు.

గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని, సౌమ్యుడు, మితభాషి అని గుర్తుచేసుకొన్నారు. రాజకీయ విధానాలు మార్చుకున్నా తన వ్యక్తిత్వం మార్చుకోలేదని జూబ్లీహిల్స్ నుంచి మూడుసార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించడం అంటే అంత ఆషామాషి విషయం కాదని, ఆయన విలువలతో వ్యవహరించడాని చెప్పడానికి ప్రబల నిదర్శనం అని వివరించారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని అరుదైన ఒక ప్రజా ప్రతినిధిని కోల్పోయామని గోపీనాథ్ కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

**అందరితో కలసిపోయే ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోంది : మంత్రి శ్రీధర్‌బాబు**



మాగంటి గోపీనాథ్ నిజాయితీగా, అందరితో కలిసి మెలసిపోయే గుణం కలిగిన వ్యక్తి అని అసెంబ్లీలో ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోందని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని ఆయన బలపరుస్తూ గోపీనాథ్ అన్నగా నాకు మార్గదర్శి వ్యక్తి చనిపోవడం దిగ్భ్రాంతి కలిగిందని, మన హృదయాలను ద్రవింపచేస్తోందని ఆయన అన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన తమ్ముడు రాజకుమార్ చనిపోతే అప్పుడు వారి కుటుంబం సంవత్సరాలు ఆ విషాదం నుంచి కోలుకోలేదని ఆయనకు ఇద్దరు అన్నలు ఉన్నారని కుటుంబ నేపథ్యం సభకు వివరించారు. హైదరాబాద్‌లో 1963లో పుట్టిన గోపీనాథ్ ఇక్కడే తన చదువులు పూర్తిచేసుకొన్నారు.

**గోపన్నగా ప్రజలకు అనురాగం పంచారు: ఎమ్మెల్యే కెటిఆర్**



బతుకమ్మ చీరెలు తెలంగాణ ప్రభుత్వం 2016లో పంపిణీ చేయడం మొదలు పెడితే, మాగంటి గోపీనాథ్ మాత్రం అంతకుముందే తన నియోజకవర్గం పరిధిలోని వారికి బతుకమ్మ సందర్భంగా చీరెలు పంపిణీచేశారని ఎమ్మెల్యే తారక రామారావు గుర్తుచేశారు. ఈ సభలో సోదరుడు, సహచరుడు, హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోపీనాథ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. జీవించి ఉన్నంత కాలం ఆయన అనారోగ్యం గురించి చెప్పుకోలేదు. పబ్లిక్ పరంగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ అంటేనే సంపన్నులు నివసించే ప్రాంతం అని పేరు. కానీ అక్కడ ఉండేది మొత్తం పేద ప్రజలు. బస్తీలతో కూడిన ఏరియా. అలాంటి ఏరియాను మాగంటి గోపీనాథ్ ఎంతో అభివృద్ధి చేశారని కెటిఆర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని హైదర్ గూడలో జన్మించిన గోపీనాథ్ కటౌట్ సంస్కృతికి పునాది వేశారని గుర్తుచేసుకొన్నారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానికిగా టిడిపి అడుగుపెట్టారు. హ్యాట్రిక్ కొట్టడం ఎమ్మెల్యేలకు అంత సులువు కాదు. అది గోపీనాథ్‌కు సాధ్యమైంది. మాదాపూర్ ఏరియాలో చాలా చిన్న ఇంట్లో గోపీనాథ్ నివాసం ఉన్నారు. బతికినంత కాలం మాస్ లీడర్‌గా డైనమిక్‌గా ఉన్నారు. స్పందించే గుణం ఎక్కువ. కేసీఆర్‌కు నమ్మిన విధేయుడిగా పని చేశారు. ఆయన మరణం పార్టీకి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తీరని లోటు. గోపీనాథ్ కుటుంబానికి మా పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**క్రమశిక్షణగల నేత మాగంటి : సభలో ప్రజాప్రతినిధుల నివాళులు**

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గోపీనాథ్ మృతిచెందడం దురదృష్టం అని అన్నారు. జూబ్లిహిల్స్ ప్రజలను ఆయన ఆశించిన రీతిలో అభివృద్ధి పరిచేబాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొంటారని తెలిపారు. బిసివెల్ఫేర్ మంత్రి హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలమనిషి మాగంటి అని కొనియాడారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలను ప్రేమించే నాయకుడు ఆయన విషయాలు ఎప్పుడు బయటకు చెప్పుకోలేదు గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన మంచి వ్యక్తి అని అన్నారు.ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్వర్లు,గోపాల్ మాట్లాడుతూ గోపీనాథ్ వివాదరహితుడని అభివర్ణించారు. బిజెపి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు గుర్తుంచుకొనే పనులు చేయాలని ఆయన మనందరికి మార్గనిర్దేశం చేశారని అని కొనియాడారు. ఎంఐఎం ఎమ్మెల్యే, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సున్ని తంగా మర్యాదగా వ్యవహరించే వ్యక్తి అని అన్నారు. సిపిఐ తరుపున ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతున్నానని చెప్పారు.

**అరుదైన నేత మాగంటి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

అరుదైన నాయకుడు మగంటి గోపీనాథ్ మృతికి సంతాప తీర్మానం చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆ తర్వాత సభను ఆదివారం(మార్చి 31) ఉదయం 9 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## గత ప్రభుత్వంలో లేని పిపిటి సంప్రదాయం ఇప్పుడెందుకు?: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చే సంప్రదాయంలేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పిపిటి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పిపిటికి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల స్టేషన్‌లలో వందేభారత్ హాల్ట్

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : సికిందరాబాద్-నాగపూర్ మధ్య నడుస్తున్న వందేభారత్ రైలుకు రెండు హాల్టింగ్‌లు ఇచ్చినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాన స్టేషన్‌లు సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల స్టేషన్లలో హాల్టింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి ఈ రెండు స్టేషన్లలో హాల్టింగ్ ఏర్పాటు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో రైల్వే మౌలిక వసతులకు నిరంతరం సహాయ సహకా రాలు అందిస్తున్న ప్రధాని ప్రధాని మోడీ రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు తెలంగాణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

## పదవీ విరమణ చేసిన అదనపు కార్యదర్శులు

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర సచివాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది శనివారం పదవి విరమణ చేశారు. సాధారణ పరిపాలన విభాగంలో పని చేస్తున్న అదనపు కార్యదర్శులు బండి యాదగిరి, నిర్మల, అరుణ్ కుమార్, ఏఎస్‌ఓ అశోక్ కుమార్, జమేదార్ అబ్దుల్లా పదవీ విరమణ సందర్భంగా శనివారం నాడు జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సంయుక్త కార్యదర్శి శివ లింగయ్య(ప్రొటోకాల్) వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన అధికారులు అంకితభావంతో పని చేశారని వారిని ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి, అత్యున్నత సేవలు అందించారని అన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది కూడా వారిని ఆదర్శంగా తీసుకొని అంకితభావంతో పనిచేయాలని, సేవా దృష్టితో విధులు నిర్వహించాలని అన్నారు.

## శాసనమండలిలో మాజీ సభ్యులు రత్నాకర్‌రావు, మాగం రంగారెడ్డికి సంతాపం

### ఆ తరువాత సోమవారానికి సభ వాయిదా

### కొత్త సభ్యులను సభకు పరిచయం చేసిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్**, ఆగస్టు 31(జర్నలిస్ట్ ఫైల్): తెలంగాణ శాసనమండలి సమావేశాలు శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సభ్యులకు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వినాయక చవితి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం కొత్తగా శాసనమండలికి ఎన్నికైన సభ్యు లను సభకు పరిచయం చేశారు. కొత్తగా మండలికి ఎన్నికైన అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్, విజయశాంతి, దాసోజు శ్రవణ్ కుమార్, సత్యం నెల్లికంటి, పింగిలి శ్రీపాల్ రెడ్డి, సి.అంజిరెడ్డి, మల్కా కొమరయ్యను పరిచయం చేయగా రెండోసారి రియాజుల్ ఎఫెండి ఎన్నిక కాగా ఆయనను కూడా సభకు పరిచయం చేశారు. అనంతరం గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు సభ్యులుగా కొనసాగి ఈ మధ్య కాలంలో మరణించిన డాక్టర్ టీ రత్నాకర్‌కి, తెలంగాణ శాసన పరిషత్తుకి రెండుసార్లు ఎన్నికై మరణించిన మాగం రంగారెడ్డికి సంతాపం తెలుపుతూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. మౌనం పాటించిన అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.



సచివాలయం వద్ద మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

## బిసి రిజర్వేషన్లు పెంచే చట్టానికి ప్రతిపక్షాలు మద్దతు తెలపాలి

### లేదా బిసి ద్రోహులుగా ప్రటిస్తాం: జాజుల

**హైదరాబాద్**,ఆగస్టు 31(జర్నలిస్ట్ ఫైల్) :సామాజిక రిజర్వేషన్ల పరిమితిని 50 పరిమితిని ఎత్తివేస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచడానికి ఈ అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని నిర్ణయించడం అభినంద నీయమని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈమేరకు శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాతనే ప్రత్యేక జీవోను తీసుకురావాలన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చేయబోయే చట్టంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు బెషరతుగా మద్దతు తెలపాలన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో రాజకీయం చేస్తే ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టానికి మద్దతు ఇవ్వని రాజకీయ పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాన్నారు. బిసిలు ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు అంటే, దేశంలో సిక్కు మతానికి రిజర్వేషన్లు ఇవ్వడం లేదా? అని ప్రశ్నించారు. మోకాలుకు బోడిగుండుకు మెలిక పెట్టి రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూసే పార్టీలను రాజకీయంగా బొంద పెడతామని హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాత రెండోసారి గవర్నర్‌కు ఆపే అధికారం లేదని గవర్నర్ ఆమోదించకుంటే బిజెపి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 రిజర్వేషన్లు పెంపుకు అన్ని రాజకీయ పార్టీలు, శాసనసభ పక్ష నేతలు శాసనసభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిక్షపతి, జాజుల లింగం తదితరులు మాట్లాడారు.

## యాదిగిరిగుట్ట ఆలయ ఇఓగా వెంకటరావు

### 31న పదవీవిరమణ చేస్తున్నందున.. పునర్నియామకం

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్): యాదగిరి గుట్ట దేవాలయం ఎక్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో)గా ఎస్ వెంకట రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న 2015 బ్యాచ్‌కి చెందిన ఐఎఎస్ అధికారి ఎస్.వెంకటరావును యాదగిరిగుట్ట ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ప్రత్యేక అధికారిగా నియమిస్తూ జీవో ఆర్‌టి నంబర్ 1179ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామక నిబంధనలు, షరతులు విడిగా జారీ చేయబడతాయని ఉత్తర్వులో పేర్కొన్నారు.

# సమస్యలను చర్చించే ధైర్యంలేని కాంగ్రెస్ సర్కారు

### బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను 30 రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరామని బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకో ప్రజాసమస్య చొప్పున 30 రోజుల పాటు చర్చించాల్సిన 30 అంశాల జాబి తాను ప్రభుత్వానికి ఇచ్చామని, కానీ కాంగ్రెస్ సర్కారుకు ప్రజాసమస్యలపై చర్చించే చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే సమావేశాలను మూడు రోజుల్లోనే ముగిస్తామంటుందన్నారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం. ప్రజాసమస్యలపై పలాయన వాదమన్నారు. భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం, రోడ్లు తెగడం, చెరువులకు గండ్లు పడడం రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు, పెన్షనుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు చేనేత, కల్లుగీత వంటి వృత్తిదారుల కష్టాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, విద్యా, వైద్య, ఇరిగేషన్, వ్యవసాయం, రెవెన్యూ, ఆర్థిక రంగాల్లోని సమస్యలు ఉన్నాయన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న భూముల అన్యాక్రాంతం, దేవాలయాలపై దాడుల వంటి అంశాలను అసెంబ్లీలో చర్చించాలలని, అందుకే 30 రోజుల పాటు సమావేశాలను నిర్వహించాలని కోరామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు అప్పటి బిఆర్ఎస్ సర్కారు అసెంబ్లీ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడాన్ని తప్పుపట్టిందని, తాము అధికారంలోకి వస్తే అసెంబ్లీని ఎక్కువ రోజులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అన్ని హామీల మాదిరే ఈ హామీ కూడా ఎగవేతనే అని, కాంగ్రెస్ సర్కార్ గత బడ్జెట్ సమావేశాలను కేవలం 11 రోజులే నిర్వహించిందన్నారు గత శీతాకాల సమావేశాలు (2024 డిసెంబరులో) జరిగింది ఏడు రోజులే అన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఇలా తక్కువ రోజుల పాటు నిర్వహించడమనేది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హయంలో అసెంబ్లీ తక్కువ రోజులే సమావేశమైందని, ఒక్క యేడాది మాత్రమే 30 రోజులకు పైగా నడిచింది. మిగిలిన సంవత్సరాలన్నీ కూడా 30 రోజుల్లోపే అసెంబ్లీ నడిచింది. కెసిఆర్ బాటలోనే రేవంత్ సర్కార్ నడుస్తూ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడం ద్వారా శాసనసభ ఔన్నత్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుని వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని తిరిగి సమావేశ పరిచి ప్రజాసమస్యలను చర్చించి, పరిష్కారాలను చూపాలన్నారు. ప్రజాసమస్యలను చర్చించే పరిష్కరించాలనే చిత్తశుద్ధిలేని సర్కారులే ఇలా వ్యవహరిస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాసమస్యలను చర్చించే దమ్ము, ధైర్యం ఉంటే వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని 30 రోజుల పాటు నడపాలని డిమాండ్ చేశారు. సభలో ప్రజాసమస్యలను చర్చిస్తే ప్రభుత్వ వైఫల్యాలు, డొల్లతనం బయట పడుతుందని సిఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నారు. అందుకే సమావేశాలను మూడురోజుల్లోనే ముగిస్తున్నారు. తమ సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించకుండా దాటవేస్తున్న దగాకోరు కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు వచ్చే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

## వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సవ్యసాచిఘోష్‌కు అదనపు బాధ్యతలు

### గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కూడా..

### ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్


**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : పశు సంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ అండ్ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొనసాగుతున్న సీనియర్ ఐఎఎస్ అధికారి సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెల్ఫేర్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అలాగే గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన జీవో ఆర్‌టి నంబర్ 1180ను జారీ చేశారు. ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా డాక్టర్ విఎస్ అలగు వర్షిణికి ఇచ్చిన అదనపు బాధ్యతల నుంచి తొలగించారు. అలుగు వర్షిణి రెండు సంవత్సరాల పాటు డిప్యూటేషన్‌లో కేంద్ర సర్వీసులకు వెళ్తున్న నేపథ్యంలో అదనపు బాధ్యతలను ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సంక్షేమ శాఖల సమన్వయంపై ప్రత్యేక మెమో జారీ**

వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖలను సమన్వయం చేస్తారని పేర్కొంటూ మెమో నంబర్ 1279ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల అంతటా సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, పథకాల కలయికను నిర్ధారించడానికి, వ్యూహాత్మక దిశానిర్దేశం చేయడానికి, ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేడర్‌లో ఒక అధికారిని సంక్షేమం కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించాలని నిర్ణయించింది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




యూసుఫ్‌గూడలో నిర్వహించిన బిజెపి బూత్ స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ)**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో బీజేపీ పార్టీ గెలుపునకు బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు అన్నారు. శనివారం యూసుఫ్ గూడ మహ్మూద్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్‌రావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘు నందన్‌రావు పాల్గొన్నారు. రామచందర్‌రావు మాట్లాడుతూ నగరంలో బలమైన పార్టీ బీజేపీ పార్టీ అని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలవటం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయం అన్నారు. రాష్ట్రాన్ని గత పదేళ్లలో బీఆర్ఎస్ కుటుంబపాలన సాగిస్తే 22 నెలల్లో కాంగ్రెస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్, ఎమ్ఐఎమ్ మద్దతుతో ముందుకు వెళ్తున్నారని ప్రజలే వారికి తగిన బుద్ది చెబుతారన్నారు. బీహార్‌లో ఎమ్ఐ ఎమ్‌తో కలిసి రాహుల్‌గాంధీ ఓట్ చోర్ జరిగిం దంటూ ప్రచారం చేస్తున్నారని కానీ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ఎమ్ఐఎమ్ కలిసి ఓట్ చోర్ అధికారులను కలుపుకుని చేస్తున్నార న్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేశాకే ఓట్లు అడగాలని ఓటు అడిగే నైతిక హక్కు ను వారు కోల్పోయారన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు, గ్రామాలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాల న్నారు. ఆరు గ్యారెంటీలలో మహి ళలకు రూ.2,500, తులం బంగారం, కాలేజి వెళ్లే విద్యా ర్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి ఏమ య్యాయని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళలకు పొదుపు సంఘాల పేరుతో రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నా మని కాంగ్రెస్ మాత్రం రుణాలకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి ఉందని ఉద్యోగులకు డీఏలు లేవని ఉద్యోగాల పంచన్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నా రు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అడుగడుగున కాంగ్రెస్‌ను అడ్డుకోవాలన్నారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను చూస్తుంటే 2020లో బీహార్ ఎన్నికల సమయంలో దుబ్బాక ఎన్నికలు నిర్వహించారని అదే పరిస్థితి ప్రస్తుతం బీహార్ ఎన్నికల సమయంలోనే జూబ్లీహిల్స్ ఎన్నికలు రావడం బీజేపీ గెలుపునకు నాందిగా పలుకుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షులు గౌతమ్‌రావు, భరత్‌గౌడ్, శ్యామ్ సుందర్‌గౌడ్, డాక్టర్ పద్మా వీరపనేని, అట్లూరి రామకృష్ణ, నగర కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారాయణతోపాటు డివిజన్ల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్టీలుగా లంబాడా, బంజారాలు రాజ్యాంగ విరుద్ధం

### సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమని, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల నుండి పిటిషన్ దాఖలైంది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపూరావుతోపాటు మరికొందరి తరఫున సీనియర్ న్యాయవాది అల్లంకి రమేశ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉత్తర్వుల సవరణ చట్టం 1976 మేరకు ఆ మూడు వర్గాలను ఎస్టీలుగా గుర్తించడం ఆర్టికల్ 342ని ఉల్లంఘించడమేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కాదని, 1976 వరకు పాత ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వలస వచ్చి అక్కడి అసలైన గిరిజనులకు ఉద్దేశించిన హక్కులను కొల్లగొట్టారని వెల్లడించారు. అంతకుముందు వారు బీసీ జాబితాలో ఉన్నారన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భంలో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉందని, ఆ సమయంలో లంబాడా, సుగాలీలను ఆంధ్రా ప్రాంతంలో ఎస్టీలుగా గుర్తించారని, కానీ హైదరాబాద్ స్టేట్‌లో కాదని తెలి పారు. కాసు బ్రహ్మానందరెడ్డి కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ఒక రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఒక కులానికి చెందిన వారు ఎస్టీలు, మరికొన్ని జిల్లాల్లో బీసీలుగా ఉండడం సరికాదని ఆ మూడు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు ఐఎఎస్ శివశంకర్ కేటాయింపు

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి శివశంకర్ లోతేటిని కేంద్రం ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించింది. ఈ మేరకు ఆయనను ఏపీకి రిలీవ్ చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఏకే మిశ్రా తెలంగాణ ప్రభుత్వానికి ఉత్తర్వులు పంపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2013 బ్యాచ్ ఐఎఎస్ అధికారి శివశంకర్‌ను ఏపీకి కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలోని ధర్మవరం శివశంకర్ సొంతూరు. కానీ రంగారెడ్డి జిల్లాలోని తన మామగారి నివాసంలో ఉండి ఆయన సివిల్ సర్వీసెసు సాధించారు. యూపీఎస్సీకి చేసిన దరఖాస్తులో తన శాశ్వత చిరునామాగా రంగారెడ్డి జిల్లానే పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో క్యాడర్‌ను నిర్ణయించేటప్పుడు చిరునామా ఆధారంగా కేంద్రప్రభుత్వం ఆయనను తెలంగాణకు కేటాయించింది.

## యూరియా అంశం కేంద్ర పరిధిలోనిది

### విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి ఛైర్మన్

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : యూరియా అంశం కేంద్రం పరిధిలోనిదని విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో లేకపోతే బీజేపీ కార్యాలయం ముందు ధర్నా చేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో తెలంగాణ రైతాంగాన్ని కేంద్రం నిండా ముంచిందని చెప్పారు. రాష్ట్రానికి ఈ సీజన్ లో కేటాయించిన యూరియా కోటాలో 60 కూడా సరఫరా చేయలేదని వెల్లడించారు. రామగుండం ఎరువుల కర్మాగారం రెండు నెలల నుంచి మూతపడినా, ఇప్పటి వరకు కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సీజన్‌లో రాష్ట్రానికి ప్రణాళిక ప్రకారం రావాల్సింది 8.30 లక్షల టన్నులు అయితే కేంద్రం ఇచ్చింది 5.95 లక్షల టన్నులు మాత్రమేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చనిపోయిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదని, వీరిలో 141 మంది రైతులకు తమ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని వివరించారు.

## యూరియాపై ఆందోళనలు

**హైదరాబాద్**, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలంటూ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనలు చేశారు. ధర్నాకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్లకు వారిని తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంతకుముందు వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వినతిపత్రం అందించారు. యూరియా కొరత తీర్చాలని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు సూచించారు.

తాము రాజకీయాలు చేయడం లేదని, రైతుల తరఫున మాట్లాడుతున్నామని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టిందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా - కావాలయ్యా యూరియా" అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# చేనేతకు చేయూత.. వస్త్ర వైభవానికి ప్రతీక





- భారతీయ కళాత్మక నైపుణ్యానికి ఇండియన్ సిల్క్ గ్యాలరీ వేదిక
- సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభించిన కేశినేని జానకీ లక్ష్మి

**విజయవాడ, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

భారతీయ సంప్రదాయాల్లో పట్టు వస్త్రాలు ప్రత్యేక ముద్రను సంతరించుకున్నాయని.. ఎంతోమంది కళాకారులు తమ కళా నైపుణ్యంతో రూపొందించిన పట్టు వస్త్రాలకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వేదికైందని, నేతన్నలే నేరుగా అమ్మకాలు నిర్వహించడం ద్వారా బయటికంటే తక్కువ ధరకు వినియోగదారులకు అందుబాటులోకి వస్తున్నాయని కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. కేంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఆధ్వర్యంలో స్థానిక ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సిల్క్ ఎక్స్‌పోను శనివారం పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ సతీమ ణి కేశినేని జానకీ లక్ష్మి ప్రారంభించి పట్టు వస్త్రాల స్టాళ్లను తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వస్త్రాభిమానులను అలరించేలా ఏర్పాటుచేసిన ఎక్స్‌పోతో బెనారసి, పశ్చిమబెంగాల్ బొటిక్ ఐటెమ్స్, టస్సార్ కాంత, చందేరి, కోటా, రాజ్‌కోట్ పటోలా, గద్వాల్, కళంకారి, కాంచీపురం, వెంకటగిరి, ఉప్పాడ జాంధానీ.. ఇలా వివిధ కళాత్మక వస్త్రాలను ఒకే వేదికపై వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా 14 వీవింగ్ క్లస్టర్ల పరిధిలోని కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అత్యద్భుతమైన డిజైన్లకు ఈ ప్రదర్శన చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను నగర వస్త్ర ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిర్వాహకులు, సెంట్రల్ సిల్క్ బోర్డు విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గ్యాలరీ సెప్టెంబర్ 2వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని.. ఈ ప్రదర్శనకు పెద్దఎత్తున వస్త్ర ప్రియులు వస్తున్నారని.. 100 శాతం చేనేత వస్త్ర ఉత్పత్తులకు ఇది వేదిక అని తెలిపారు. వివాహాలు, దసరా, దీపావళి వంటి పండగల నేపథ్యంలో ఈ ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. దేశంలో ఒక్కో ప్రాంత కళాకారులది ఒక్కో అద్భుత శైలి అని.. అన్ని ప్రాంతాల కళాకారుల చేతిలో తయారైన వస్త్రాలను ఒకేచోట అందుబాటులో ఉంచడం ద్వారా ఆయా ప్రాంతాల నేత కళాకారులను ప్రోత్సహించడంతో పాటు వస్త్ర ప్రియులకు తక్కువ ధరల్లో మంచి వస్త్రాలను అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. ఇలాంటి వస్త్రాలకు మద్దతివ్వడం ద్వారా మన ఘన చేనేత వైభవాన్ని భావి తరాలకు వారసత్వ సంపదగా అందించేందుకు వీలవుతుందని వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో బ్రాండ్ అంబాసిడర్ పి.దీపిక, మహిళా పారిశ్రామికవేత్త సజ్జా మంజుల పాల్గొన్నారు.

# హిందూ హైస్కూల్లో తెలుగు, క్రీడా దినోత్సవ వైభవోత్సవాలు



**విజయవాడ, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలుగు వారంతా తెలుగులోనే తమ దైనందిన వ్యవహారాలు నడుపుకొని తెలుగు వారిగా జీవించినప్పుడే గిడుగు రామమూర్తి పంతులు ఆత్మకు శాంతి లభిస్తుందని తెలుగు రిసోర్స్ పర్సన్ జూపూడి రామకృష్ణ అన్నారు. పాతబస్తీలోని ఎస్ కే పి వి హిందూ హైస్కూల్ లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూపూడి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల మాట్లాడుకునే భాషలోనే పాఠ్యపుస్తకాలతో సహా భాషకు సంబంధించిన అన్ని వ్యవహారాలు సాగాలని తన జీవితపు చివరి శ్వాస వరకు గిడుగు వెంకట రామమూర్తి కృషి చేశారని తెలిపారు. పాఠశాల కార్యదర్శి కే ఎల్ వి మోహనరావు మాట్లాడుతూ ప్రజల భాష కోసం పరితపించిన పుణ్యజీవిగా గిడుగును అభివర్ణించారు. క్రీడల్లో తమ పాఠశాలకు నేషనల్ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. క్రీడా ప్రతిభ అవార్డుల్లో జిల్లా స్థాయిలో తమ పాఠశాల ఐదవ స్థానం సాదించిందన్నారు. తొలుత గిడుగు రామ్మూర్తి, ధ్యానం చేద్దాంధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులను, పిఈటి ప్రసాద్ ను సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల ప్రతినిధి బ్రహ్మేశ్వర రావు, తెలుగు ఉపాధ్యాయులు కొంచెం శ్రీనివాస్, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, డాక్టర్ కొమాండూరి కృష్ణ, వ్యాయామాధిపతి ఎం.వి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# విద్యార్థుల పురోగాభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి ఎంతైనా అవసరం



**విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

పాఠశాల లోని విద్యార్థుల వ్యక్తిగత మానసిక,శారీరక పురోగాభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి ఎంతైనా అవసరమని రాష్ట్ర పాఠశాల విద్యా ప్రాంతీయ ( కాకినాడ) సంచాలకులు జి.నాగమణి పేర్కొన్నారు.శనివారం ఎన్ టి ఆర్ జిల్లా విద్యాశాఖాధి కార్యాలయం లో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి నాగమణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేడు విద్యార్థులు ప్రతి చిన్న విషయానికి మానసిక ఒత్తిడికి గురై ఆత్మ హత్యలు దాకా వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు దేనినైనా ఎదుర్కొనే మానసిక స్థైర్యం ఉందని అది వ్యాయామ ఉపాధ్యాయులు వల్లే సాధ్యమవుతుందని అన్నారు.అన్ని ఒత్తిళ్లను అధిగమించడానికి అది ఒక్క వ్యాయామం ,ఆటల వల్లే సాధ్యమని,కావున పాఠశాలల్లో వ్యాయామం క్రీడలు తప్పనిసరిగా జరిగేలా వ్యాయామ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.జిల్లా విద్యాశాఖాధి కారి యు వి సుబ్బారావు మాట్లాడుతూ చిన్న దేశాలు ఒలింపిక్స్ లో పతకాల సాధించడం లో ముందంజలో ఉన్నాయని మనం చాలా వెనుకంజలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలల్లో విద్యార్థులు అందరూ ఆటలు ఆడేలాగా వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ చూపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు రాష్ట్రం లోని ఎన్ టి ఆర్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం ఎంతో గర్వ కారణం అని,గత మూడేళ్ళనుంచి ఈ అవార్డులను రాష్ట్రం లో నే ఎన్టీఆర్ జిల్లా దక్కించుకోవడం సరికొత్త రికార్డు అని హర్షం వ్యక్తం చేశారు.అనంతరం రాష్ట్రం లోని ప్రథమ స్థానం సాధించిన నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రవిప్రసాద్,వ్యాయామ ఉపాధ్యాయులు టి శ్రీలత,టి.విజయ వర్మ లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అదేవిధంగా జిల్లా లో ద్వితీయ స్థానం కె బి సి జిల్లా పరిషత్ హై స్కూల్,తృతీయ స్థానం ఎస్ టి వి ఆర్ మున్సిపల్ హై స్కూల్,చతుర్థ స్థానం నిడమానూరు జిల్లా పరిషత్ హై స్కూల్,ఐదవ స్థానం ఎస్ కె పి వి వి హిందూ హై స్కూల్ కు అవార్డులను అందజేశారు. గత మూడేళ్ల నుంచి పాఠశాల క్రీడల్లో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రం లో నే అగ్ర స్థానం నిలవడానికి తోడ్పడిన జిల్లా విద్యా శాఖ అధికారి యు వి సుబ్బారావు ను వ్యాయామ ఉపాధ్యాయులు గానం గా సత్కరించారు.ఈ కార్యక్రమం లో కార్యాలయ సూపరింటెండెంట్ జి.రమణ కుమారి,వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ వి వి భాస్కర్,డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, లు పాల్గొన్నారు.

# నిరుద్యోగ మహిళలు డ్రైవింగ్ శిక్షణకు సెప్టెంబర్ 7వ తేది లోగా ధరఖాస్తు చేసుకోవాలి

## ఎన్టీఆర్ జిల్లా ఎస్‌సి కార్పోరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ షాహిద్ బాబు

**విజయవాడ, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకి చెందిన హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ పాఠశాలలో హెవీ మోటార్ వెహికల్ (హెచ్‌ఎంవి) డ్రైవింగ్ శిక్షణకు ఎన్.టి.ఆర్ జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలు సెప్టెంబర్ 7వ తేది లోగా ధరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఎస్‌సి కార్పోరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ షాహిద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు పూర్తి చేసిన ధరఖాస్తుకు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్(ఎల్.ఎం.వి), హెవీ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్‌ఎల్‌ఆర్) పత్రాలను జత చేసి కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లోని యస్.సి కార్పొరేషన్ కార్యాలయము లో అందజేయవలసి ఉంటుందని, ఇతర వివరాలకు 96520 57244 నెంబర్‌ను సంప్రదించవచ్చునని జిల్లా ఎస్‌సి కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు ఆ ప్రకటనలో తెలిపారు.

# పారిశ్రామిక సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి

- ఈజ్ ఆఫ్ డూయింగ్, స్పీడ్ ఆఫ్ డూయింగ్‌లో జిల్లాను అగ్రగామిగా నిలపాలి
- అన్ని విధాలా మద్దతు.. పెద్దఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలి
- డీఐఈపీసీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

పారిశ్రామిక రంగానికి సంబంధించి సమన్వయ శాఖలు అందించే అన్ని సేవలపైనా యూజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలని.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోనూ జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. తొలుత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) నిర్వహించే బీఆర్‌ఏపీ-2024 సర్వేపై పారిశ్రామిక వర్గాలకు అవగాహన కల్పించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ర్యాంకింగ్స్ ఇచ్చే విధానాన్ని, పరామితులను క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ర్యాంకింగ్‌ను మెరుగుపరిచేందుకు వీలుగా ప్రతి శాఖా తమశాఖ ద్వారా సేవలు పొందిన వారికి సింగిల్ విండో వ్యవస్థతో పాటు వివిధ ఆన్‌లైన్ సేవలు వంటివాటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలన్నారు. ముఖ్యమంగా కమర్షియల్ ట్యాక్స్, లేబర్ డిపార్టుమెంట్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, పరిశ్రమలు-వాణిజ్యం తదితర శాఖలు దీనిపై దృష్టిపెట్టాలన్నారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 29 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 2,958 దరఖాస్తులు రాగా 2,921 దరఖాస్తులు పరిష్కారమయ్యాయని, మిగిలిన వాటిని నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా వివిధ పారిశ్రామిక అభివృద్ధి విధానాల కింద పది క్లెయిమ్‌లకు రూ. 1.52 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలకు కమిటీ ఆమోదం తెలిపింది. పరిశ్రమల ఏర్పాటుకు అత్యుత్తమ వాతావరణం రాష్ట్రంలో ఉందని.. ఔత్సాహికులు పెద్దఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలన్నారు. 2025-26కు సంబంధించి పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ పథకాల అమల్లో పురోగతిని కమిటీలో చర్చించి.. దరఖా స్తులను త్వరిగతిన పరిష్కరించేందుకు, యూనిట్ల ప్రారంభానికి కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్)కు సంబంధించి మండల ప్రధాన కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్‌లను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకటరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు, సర్వీస్ యూజర్లు పాల్గొన్నారు.

## లడ్డు, ప్రసాదాల తయారీలో పనిచేస్తున్న

# బ్రాహ్మణులను వెంటనే రెగ్యులర్ చేయాలి

- అవసరమైన ఆరోగ్య బీమాను తక్షణమే కల్పించాలి
- ధార్మిక పరివార్ జాతీయ అధ్యక్షులు వివి రామారావు




**విజయవాడ, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

తిరుమల తిరుపతి దేవస్థానం లోని లడ్డు, ప్రసాదాల తయారీ విభాగంలో పనిచేస్తున్న బ్రాహ్మణులను వెంటనే రెగ్యులర్ చేయడమే కాకుండా వారికి అవసరమైన ఆరోగ్య బీమాను తక్షణమే కల్పించాలని ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక డిమాండ్ చేసింది. దశాబ్దాలుగా తాత్కాలిక ఉద్యోగులుగా ఉన్న వారిని వెంటనే పర్మెంట్ చేయడమే కాకుండా వారికి అవసరమైన ఆరోగ్య బీమాను తక్షణమే కలిపించాలని డిమాండ్ చేస్తూ ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఈ ఆందోళనకు సంబంధించిన కార్యక్రమాలను శనివారం విజయవాడలోని హోటల్ స్వర్ణ పాలెస్ హోటల్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ధార్మిక పరివార్ జాతీయ అధ్యక్షులు వివి రామారావు మాట్లాడుతూ గత 25 సంవత్సరములుగా దేవుని కైంకర్యాలలో భాగమై ఎంతో కీలకమైన ప్రసాదాల తయారీలో భక్తి శ్రద్ధలతో నిమగ్నమైన పోటు లోని లడ్డూ మరియు ఇతరత్రా ప్రసాదాల తయారీ కార్మికులను దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 25 సంవత్సరములకు పైగా పని చేసిన వారెందరో ఉన్నా ఇంత వరకూ వీరిని రెగ్యులరైజ్ చేయకపోవడం వలన వారికి ఉద్యోగులకు సమానంగా అందాల్సిన ఇతర ప్రయోజనాలు అందడం లేదని వివరించారు. ఎవరికైనా ఆనారోగ్యం వస్తే పట్టించుకొలేనంత దారుణ స్థితిలో కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. అదే సందర్భంలో టిటిడి లోని పలు ఇతర కార్మికులను దేవస్థాన యాజమాన్యం పలు సందర్భాలలో రెగ్యులరైజ్ చేసిందని పేద బ్రాహ్మణుల విషయంలో మాత్రం చొరవ చూపకుండా చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో శ్రీవారి సన్నిధి లో ముఖ్యంగా అందరూ ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ తయారీ పని లో నిమగ్నమైన పేద బ్రాహ్మణ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చెయ్యాలని అలానే వారికి కూడా ఇతర టీటీడీ ఉద్యోగస్థుల వలే ఆరోగ్య భీమా సదుపాయాన్ని వెంటనే కలిపించాలని డిమాండ్ చేశారు. దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న ఈ కార్మికుల తరపున పోరాడాలని ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ల తరపున నిర్ణయించామని ఇందులో భాగంగా భాగంగా టీటీడి పేద బ్రాహ్మణుల సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ అమెరికా, కెనడా యూకె , ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లోని మా ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో 146 నదీ జలాల మహా రుద్రాభిషేకాన్ని ఆయా దేశాలలో సెప్టెంబర్ 6 వ తేదీ మరియు విజయవాడలోని సత్యనారాయణ పురం సెప్టెంబర్ 14న నిర్వహించబోతున్నామని వెల్లడించారు. రుద్రాభిషేక కార్యక్రమ అనంతరం కార్యక్రమంలో పాల్గొంటున్న బ్రాహ్మణులు ఈ సమస్యపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రితో పాటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని కలిసి విజ్ఞాన పత్రాన్ని అందజేసి సమస్యలను పరిష్కారించాలని కోరబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

## వికలాంగుల పట్ల జూనియర్ అసిస్టెంట్ దురుసు ప్రవర్తన



- వినతిపత్రం ఇవ్వడానికి వస్తే రెండు గంటలు నిరీక్షణ
- ఫోటో తీసుకుంటామంటే వినతిపత్రం విసిరివేత
- జూనియర్ అసిస్టెంట్ పై చర్యలకు డిమాండ్

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో వికలాంగుల పట్ల జూనియర్ అసిస్టెంట్ దురుసు ప్రవర్తించాడు. పింఛన్లు తొలగించారనీ, రీ వెరిఫికేషన్ చేయాలనీ కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన వికలాంగుల పట్ల జూనియర్ అసిస్టెంట్ ప్రతాప్ దౌర్జన్యంగా వ్యవహరించినట్లు వికలాంగులు వాపోతున్నారు. రెండు కాళ్ళు, చేతులు లేక నడవలేని స్థితిలో కార్యాలయానికి వస్తే రెండు గంటల పాటు నిరీక్షణ చేశామని వారు అంటున్నారు. వినతిపత్రం ఇచ్చే సమయంలో ఫోటో తీసుకుంటామనే వాటిని దురుసుగా మాట్లాడుతూ విసిరి వేయడం పై వారు అగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే పింఛన్లు నిలిపి వేశారని, ఇప్పటికే రెండు నెలలు పెండింగ్ పడే అవకాశం ఉందని, తమ పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరికాదని వాపోతున్నారు. అధికారులు వెంటనే వెరిఫికేషన్ చేసి తమకు పింఛన్ వచ్చే విధంగా చూడాలని, వచ్చే పింఛన్ పై ఆధారపడి జీవిస్తున్నామని వేడుకుంటున్నారు. అదే విధంగా తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారి పై చర్యలు తీసుకోవాలని వికలాంగులు కోరుతున్నారు.

## చెత్త నుండి పవర్ ఉత్పత్తి

### మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాలతో చెత్త నుండి సంపదే కాకుండా విద్యుత్ ఉత్పత్తి



**ఆగిరిపల్లి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

నూజివీడు పట్టణంలో 32 వార్డల ప్రజలు సుమారు 70వేల జనాభా ఇంటి అవసరాలకు వాడిన ముడిసరుకులు మరియు ఇతర సరుకులు వాడగా మిగిలిన చెత్త సుమారు ఒక్క రోజుకు సుమారు 28 టన్నులు రాగా, దానిలో పొడిచెత్త 10టన్నులు, తడి చెత్త 18టన్నుల రాగా దానిని రీసైక్లింగ్ చేసి రోజుకి 10 టన్నుల చెత్తను గుంటూరు జిందాల్ విద్యుత్ సంస్థకు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది దాని ద్వారా విద్యుత్ తయారు కాగా రాష్ట్ర ప్రజల విద్యుత్ వినియోగానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.ఈ కార్యక్రమం రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాలతో నేడు మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ పి, సత్యన్నారాయణ జెండా ఊపి ప్రారంభించారు.కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాలతో నేడు చెత్తను జిందాల్ సంస్థకు త్సరలిస్తున్నామన్నారు.దీని ద్వారా విద్యుత్ ఉత్పత్తి అయ్యి అమరావతి నిర్మాణానికి, మరియు రాష్ట్ర ప్రజల విద్యుత్ వినియోగానికి ఎంతగానో ఉపసయోగ పడుతుందన్నారు.రాష్ట్ర విద్యుత్ వినియోగ దారులకు విద్యుత్ సరిపడా విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పట్టణంలో పొల్యూషన్ తగ్గి స్వేచ్ఛా వాయువు లభిస్తుందన్నారు. అంతే కాక చెత్తనుండి నెలకు సుమారు 6 టన్నుల ఎరువు కూడా తయారుచేసి టన్ను సుమారు. రూ.3వేలకు రైతులకు అమ్మడం జరుగుతుందని దాన్ని రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ రీసైక్లింగ్ ప్రాసెస్ అంతా క్యూబ్ బయో ఎనర్జీ సంస్థకు టెండర్ ద్వారా అప్పగించామన్నారు. ఈ సంస్థ కు 20 సంవత్సరాలు లీజుకు సుమారు 3 ఎకరాలు లీజుకు ఇచ్చామన్నారు. ఈ ప్రాసెసింగ్ కు ప్రజలు కూడా సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సి, ఎచ్,దుర్గాప్రసాద్, పి,సత్యనారాయణ, సత్యం, శ్రీనివాసరావు, బి, మాధవరావు,రమేష్, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు భయపడను

### విద్యార్థి దశ నుంచే ఎన్నో చూశా..: కోటంరెడ్డి

**నెల్లూరు, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాజకీయ ప్రత్యర్థుల బుడ్డ బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. రౌడీషీటర్ల సంభాషణ వెనుక వైసీపీ హస్తం ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. నెల్లూరులో శనివారం ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అనేక హెచ్చరికలు చూశానన్నారు. 25 ఏళ్లపాటు రాజ్యాధికారం తనదేనంటూ విర్రవీగిన జగన్‌ను, అధికారాన్ని వదులుకుని 16 నెలలు ముందుగానే వైసీపీ నుంచి బయటకు వచ్చానని గుర్తుచేశారు. రౌడీషీటర్ల సంభాషణ చూసి దిగ్భ్రాంతికి గురయ్యానన్నా రు. అయితే ఇది గిరిధర్‌రెడ్డి కుట్రం టూ వైసీపీ శ్రేణులు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అ లాంటి సంస్కృతి తమ ఇంటా వం టా లేదన్నారు. కుటుంబ సభ్యులను చంపుకోవాల్సిన కర్మ తనకు పట్టలేదని, అది వైసీపీ నాయకులకే అలవాటని.. ఇలాంటి ఆలోచనలు వైసీపీ డీఎన్‌ఏలోనే ఉన్నాయని దుయ్యబట్టారు. జూలై 1న రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియో తాజాగా బయటకు రావడం, ఆ వీడియో తన దృష్టికి మూడు రోజుల ముందే వచ్చిందని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ప్రకటించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమాచారం తనకివ్వకపోవడంతో అసంతృప్తిగా ఉన్నానన్నారు. ఈ ఘటనపై హోం మంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఫోన్ చేసి పరామర్శించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 'నన్ను చంపితే డ బ్బే, డబ్బంటూ రౌడీషీటర్లు చెప్పడం ఆశ్చర్యం కలిగించిం ది. ఆ డబ్బు వారికి ఎవరిస్తానన్నారు? ఆ అవసరం ఏ ముందో నిజాలను లోతుగా విచారించాల్సిన బాధ్యత జిల్లా పోలీసు శాఖపై ఉంది. తాజాగా బయటకు వచ్చిన బెదిరింపులతో శ్రేణులెవరూ ఆందోళన చెందవద్దు. జాగ్రత్తలు తీసుకుంటున్నాను' అని ఎమ్మెల్యే తెలిపారు. శ్రీధర్‌రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పోలీసు యంత్రాంగం రౌడీషీటర్ల అంతు చూడాలని సూచించారు.

# ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలి

- పి.ఆర్.సి. కమిషనర్ వెంటనే నియమించాలి
- ఏపీ ఎన్జీజీఓస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డి.ఎస్.ఎన్. రెడ్డి



**విజయవాడ, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల లాగే ప్రభుత్వ ఉద్యోగులు సైతం కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించుకున్నామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏ.పి. ఎన్.జి.జి.ఓ. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారా యణ రెడ్డి డిమాండ్ చేసారు. శనివారం గాంధీనగర్ లోని ఏపీ ఎన్జీజీవో హోమ్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు డి. ఎస్.ఎన్. రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తి కావస్తున్న తరుణంలో ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులు తమకు రావలసిన బకాయిలను గాని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గాని పరిష్కరిం చాలని డిమాండ్ చేయలేదని గుర్తు చేశారు. గత ప్రభు త్వంలో జరిగిన ఆర్థిక అవకతవకల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లు సమయమనం పాటించారన్నారు. కానీ ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో స్పందిస్తున్న తీరు నిరాశాజ నకంగా ఉందన్నారు. ప్రధానంగా పి.ఆర్.సి. కమిషన్ నియామకంలో ప్రభుత్వం దోబూచులాట మానేసి పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. పి.ఆర్.సి కమిషనర్ నియామకం గురించి గత ప్రభుత్వ కాలంలో డా. మన్మోహన్ సింగ్, ఐ.ఏ.ఎస్ (రిటైర్డ్)ను 12వ వేతన సవరణ సంఘం కమిషనర్‌గా నియమించడం జరిగిందని కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆయన పదవికి రాజీనామా చేశారని జూలై 23 నుండి వేతన సవరణలు అమలుకావలసి ఉన్నప్పటికీ దాదాపు రెండు సంవత్సరాలు గడిచిందని ఉద్యోగులు పెన్షనర్లకు న్యాయం జరిగేలా తక్షణమే కొత్త కమిషనర్ నియామకం చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు డి.ఏ/డి.ఆర్‌ను తక్షణమే మంజూరు చేసి విడుదల చేయడంలో జరుగు తున్న జాప్యాన్ని నివారించాలని కోరుతున్నామన్నారు. డి.ఏ., మరియు పి.ఆర్.సి బకాయిలు, గత 3-4 సంవత్సరాలుగా సంపాదించిన సెలవు మొత్తాలు, డి.ఏ. బకాయిలు, పి.ఆర్.సి బకాయిలు విడుదల కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. వీటిని త్వరితగతిన ఆర్థిక ఆమోదం తెలపాలని కోరారు. తాత్కాలిక ఉపశమన భత్యం, మంజూరు పి.ఆర్.సి కమిషనర్ పునర్నియా మకంలో ఆలస్యం, పి.ఆర్.సి నివేదిక తుదీకరణలో జాప్యం దృష్ట్యా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తాత్కాలిక ఉపశమన భత్యం మంజూరు చేయవల సిందిగా కోరుకుం టున్నామన్నారు. వీటితోపాటుగా రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్ మొత్తాలు మొదలైనవి తక్షణమే విడుదల చేసి, వారికీ రిటైర్మెంట్ అనంతరం అవసరాలు తీర్చుకునేలా ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా కోరారు. జిల్లా కార్యదర్శి పి. రమేష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అడుగులు వేయాలన్నారు. ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర సంఘం డిమాండ్ మేరకు ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పెన్షనర్లకు సంబంధించి 70 నుండి 75 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పెన్షనర్లు/ఫ్యామిలీ పెన్షనర్లకు బేసిక్ పెన్షన్‌పై 10%, 75 నుండి 80 సంవత్సరాల మధ్య వయస్సు వారికి 15% అదనపు పెన్షన్ గతంలో ఇవ్వబడేదన్నారు. 11వ పి.ఆర్.సి అమలు తర్వాత రద్దు అయిన ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరిం చవలసిందిగా కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచారు.అదే విధంగా పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ మరియు గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకూ ఈ సౌకర్యాన్ని కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. వీటితో పాటుగా ఇతర ప్రధాన సమస్యలైన 1-9-2004 లోపు పోస్టింగ్ పొందిన ఉద్యోగులకు ఓపిఎస్ అమలు, హెచ్.ఓ.డీ లలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటి స్థలాలు, ఏ.పీ.జి. ఎల్.ఐ. పాలసీలకు బోనస్ ప్రకటన, ఈహెచ్ఎస్ స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహణ, రీయంబర్స్మెంట్ రెండు లక్షల నుంచి 5 లక్షల పెంపు, బిల్లుల మంజూరులో ఆలస్యాన్ని సవరించటం, ఒప్పంద ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు, రెండు సంవత్సరాల ఉద్యోగ కాలం పూర్తి చేసిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెం ట్లు మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల న్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు వి.వి. ప్రసాద్, కోశాధికారి బి.సతీష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.వి.రమణ, ఉపాధ్యక్షులు ఎం.రాజుబాబు, గోపాలకృష్ణ, నాగేంద్ర, రామకృష్ణ, డి. విశ్వనాథ్, వి. నాగార్జున, మహిళా కార్యదర్శి కె.శివలీల జిల్లాలోని తాలూకా, యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహిళా కమిషన్‌కు త్వరలో వెబ్‌సైట్

### సులభంగా గుర్తుండేలా కొత్త టోల్ ఫ్రీ నంబర్ తెస్తాం: రాయపాటి శైలజ



**రాజమహేంద్రవరం, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

'రాష్ట్ర మహిళా కమిషన్‌కి ఇప్పటి వరకూ వెబ్‌సైట్ లేదు. త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. అలాగే ప్రస్తుత టోల్‌ఫ్రీ నంబరులోని అంకెలు తగ్గించి సులభంగా గుర్తుండే విధంగా నూతన నంబరును అందుబాటులోకి తెస్తాం' అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మహిళా భద్రతపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'స్కూళ్లల్లో విద్యపైనే దృష్టి పెడుతున్నాం. హక్కులు, బాధ్యతలను తెలియచేసే, వాస్తవిక దృక్పథాన్ని పెంచే అంశాలనూ పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు మోరల్ క్లాసెస్ ఉండేవి. వాటిని పునరుద్ధరించాల్సిన ఆశ్యకత నేడు ఉంది. కారణాలేమైనా గృహ హింస కేసుల సంఖ్య పెరిగింది. ఆడపిల్లలు పెద్దలు చెప్పినా వినిపించుకోకుండా సోషల్ మీడియా, ఆన్‌లైన్ స్నేహాలు అంటూ చదువుకోవాల్సిన వయసులో తీసుకునే తొందరపాటు నిర్ణయాల వల్ల కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అమ్మాయి, అబ్బాయి ఎలా నడుచుకోవాలి? ఎలా గౌరవించుకోవాలి? వంటి అంశాలపై ఇంట్లో పెద్దలు కూడా వారికి చెప్పాలి' అని శైలజ సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్లలో 90 శాతం మహిళా ఉద్యోగులు, కౌన్సెలర్లు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వానికి సిఫారసు చేశాం' అని చైర్‌పర్సన్ తెలిపారు.

### "తెలుగు భాష- స్వర్ణ భారత్- తిక్కన" పురస్కారానికి

# 5 లక్షల రూపాయల మూల నిధి

- ప్రకటించిన భారత 13వ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు
- ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం
- అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సూచన





**నెల్లూరు, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

భారత 13వ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలుగు భాషపై తన మమకారాన్ని మరోసారి చాటుకున్నారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని శనివారం సందర్శించిన సందర్భంగా "తెలుగు భాష- స్వర్ణ భారత్- తిక్కన" పురస్కారానికి తన వ్యక్తిగత పెన్షన్ నుంచి 5 లక్షల రూపాయలు మూల నిధిగా ప్రకటిం చారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రతి ఏటా ఎంపిక చేసే తెలుగు భాష సేవకులకు ఈ మూల నిధి నుంచి పురస్కారం అందజేస్తారు. నెల్లూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఈ అధ్యయన కేంద్రా న్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఉందని అన్నారు. " భారత ప్రభుత్వం తలపె ట్టిన ప్రణాళికల్లో ప్రాచీన భారతీయ భాషల పరిరక్షణ, పోషణ, అభ్యున్నతి, ప్రాచుర్యం అత్యంత ప్రాధాన్యత గల అంశాలు. అందులో భాగంగానే వివిధ భాషల అధ్యయన కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏ భాష అధ్యయన కేంద్రం అయినా ఆ భాష మాట్లాడే గడ్డపై ఉంటే న్యాయం జరుగుతుంది. అందుకే తిక్కన సోమయాజి నడయాడిన నేల మీద ఈ విశిష్ట కేంద్రం ఏర్పాటు చేయడం సరైనది భావించి నా వంతు ప్రయత్నం చేశాను. తెలుగు భాషాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అద్దె లేకుండా తాత్కాలికంగా నైనా సరే ఉచితంగా ఈ కార్యాలయాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చిన స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్ కు అభినందనలు." అని అన్నారు. ఆంధ్రుడు ఆరంభ సూర్యుడు అనే అపవాదు తప్పని ఈ తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మనం నిరూపించాలని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. "కేంద్ర ప్రభుత్వ దూరదృష్టితో, మన చొరవతో ఈ విశిష్ట కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషమే. అయితే ఇంతటితో మన బాధ్యత ముగిసిపోలేదు. ఎందుకంటే ఈ కేంద్రం మన రాష్ట్రంలో ఉంది, మన భాష ప్రాచుర్యం కోసం ఏర్పడింది. అందుకే దీన్ని ప్రోత్సహించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన కూడా ఆధారపడి ఉంది. కేవలం కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని సరిపెట్టుకోకూడదు. అందుకే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలని నేను కోరుతున్నాను. తెలుగు గడ్డపై ఉన్న ఈ కేంద్రం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ముందుకు రావాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యామంత్రి చొరవ తీసుకోవాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా నడుం బిగించాల్సిన అవసరం ఉంది." అని చెప్పారు. తెలుగు భాషలో విస్తృతమైన పద సంపద ఉందని, దాన్ని కాపాడుకోవాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. "తెలుగుభాషలో పద సంపదకు కొదవలేదు. ఎన్నో పదాలు కనుమరుగయ్యాయి. కనుమరుగవుతున్నాయి. వాటన్నింటినీ సేకరించి, అర్థాలను విడమరిచి ప్రజలందరికీ చేరువ చేస్తే ఆధునిక భావనలకు దగ్గరగా ఉండే ఎన్నో పదాలు మన భాషలోనే దొరుకుతాయి. ఆంగ్లభాషపై ఆధార పడాల్సిన అవసరం లేదు. నిఘంటు నిర్మాణ శాస్త్రం, చరిత్ర, సమాజ శాస్త్రం, మానవ నిర్మాణ శాస్త్రం, పురావస్తు సాక్ష్యాలు, లిఖిత ప్రతులు, ప్రాచీన లిపి శాస్త్రం, కళ, వాస్తుకళ, ప్రవాసాంధ్ర గాథలపై ప్రత్యేక దృష్టి సారించి ఆధునిక సాంకేతిక పదాలకు సమానమైన సహజ తెలుగు పదాలను గుర్తించి వాడుకలోకి తేవాలి. ప్రజలే, ముఖ్యంగా గ్రామీణ ప్రజలు చాలా పదాలను సహజ రీతిలో సృష్టిస్తారు. వాటిని ఒడిసి పట్టుకోవాలి. తెలుగులో ఒక్కో ప్రాంతంలో ఒక్కో మాండలికంలో ఒక్కో విశిష్టత ఉంది. ఆయా మాండలికాల్లో, ఆయా ప్రాంతాల్లో ఎంతో పద సపంద దాగి ఉంది. ఆ పద సంపదనంతటినీ ఒక్క చోట చేర్చి అందరికీ అందుబాటులోకి తెస్తే కొత్తగా పదాలను సృష్టించే అవసరమూ తగ్గుతుంది. ఈ పనిని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం చేపట్టాలి." అని చెప్పారు. మన భాషా సాహిత్య, సంస్కృతీ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఒక భాష ప్రాధాన్యత తగ్గితే దాని చుట్టూ ఉన్న వేలాది సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు కూడా క్రమంగా తెరమరుగవుతాయని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రాచీన తెలుగు ప్రతులను, గ్రంథాలను యుద్ధప్రాతిపదికన డిజిటలీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్ కుమార్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకు లపతి శ్రీనివాసరావు, దూరదర్శన్ పూర్వ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రేవూరి అనంత పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు. మాడభూషి సంపత్ కుమార్ రచించిన కృష్ణదేవరాయల కీర్తి వ్యాస సంకలనం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆయన వెంకయ్యనాయుడుకి అంకితమిచ్చారు.

## రోటరీక్లబ్ ఆఫ్ ఆంధ్రాప్యారీస్ తెనాలి ప్రారంభం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ప్రోత్సాహంతో తెనాలిలో మరో రోటరీ క్లబ్ పురుడు పోసుకుంది. రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్రప్యారీస్ తెనాలిగా, రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ సోమవరపు వెంకట రాంప్రసాద్ ప్రకటించారు.

సుల్తానాబాద్ లోని శ్రీనివాసన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు నల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన డాక్టర్ సోమవరపు వెంకటరాం ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని, నూతన క్లబ్బులో, భాగస్వామ్యం వహించే సభ్యుల పేర్లను వివరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ తెనాలి చార్టర్ ప్రెసిడెంట్ గా, రావి కృష్ణ మోహన్, కార్యదర్శిగా సాగర్, కోశాధికారిగా మధుబాబు, ఫౌండేషన్ చైర్మన్ గా రావి భగవత్ దత్తు, మెంబర్ షిప్ చైర్ కావూరి చంద్రమోహన్ లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్, రాంప్రసాద్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా చరిత్రను వివరించారు. రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ రోటరీ సేవల పట్ల ఆసక్తిని పెంచుకుని, నూతన క్లబ్ ఏర్పాటులో భాగస్వాములైన వారికి అభినందనలు తెలిపారు. అనంతరం పెదరావూరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులతో, మారీస్ పేట చెంచు రామానాయుడు మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులతో, ఇంట్రాక్ట్ కార్యక్రమ, క్లబ్ సభ్యులకు రోటరీ పిన్స్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకట్ నారాయణ,, జిల్లా సహాయ కార్యదర్శి గుత్తా వెంకటరత్నం, యశ్వంత్ కుమార్, కెవి కృష్ణ కొల్లి రాజేంద్రప్రసాద్, సుబ్బారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## రత్నసిద్ధి గణపతి అన్నదానం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి శివాలయం వద్ద శ్రీ రత్న సిద్ధి గణపతి మందిరం లో వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా ఐదో రోజైన ఆదివారం మందిరం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, గణపతి హోమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత దంపతులు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం మన్నెం దంపతులు మాట్లాడారు. మందిరంలో ప్రతి ఏడాది చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మందిరం వ్యవస్థాపక చైర్మన్ యడ్ల గురునాథం, దుర్గంబ దంపతులు, భక్త బృందం ప్రతినిధులు గూండా రామాంజనేయులు, కేశనం సుబ్బారావు, ఆలేటి నాగలక్ష్మి, కుర్రి వెంకటరెడ్డి, మహాదేవరాజు, ఒంటెద్దు ఆంజనేయ ప్రసాద్, గాదే నాగేంద్రం, కాలంగి రామ్మోహనరావు, కుర్రా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీ సోమవారం "డయల్ యువర్ కమిషనర్" మరియు "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు కమిషనర్ ఛాంబర్లో "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు ఫోన్ ద్వారా నేరుగా 0863-2224202 నంబర్లో కమిషనర్‌కు తెలియజేయవచ్చు. అనంతరం మధ్యాహ్నం 1:00 గంట వం-కు కౌన్సిల్ సమావేశ మందిరంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం జరుగుతుంది. ఈ వేదికలో ప్రజలు తమ అర్జీలు, ఫిర్యాదులు నేరుగా సమర్పించుకోవచ్చు. నగర ప్రజలు ఈ రెండు అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ముందుకు తీసుకురావాలని కమిషనర్ పులి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వం అమలుచేసే పథకాలు జనసేనగా ప్రజల్లోకి తీసుకువెళదాం

○ మంత్రి నాదెండ్లమనోహర్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందె సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా జనసేన పార్టీ ముందుకు వెళుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

మండలంలోని కటెవరం గ్రామం బీసీ కాలనీలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా పార్టీ సెంట్రల్ జోన్ కో కన్వీనర్ మంచాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన, పార్టీ జెండాను ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. అదేవిధంగా మహిళలకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి కళ్ళజోళు ్ళ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, మహిళలకు కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జనసేన పార్టీని అందరూ గర్వించే విధంగా ముందుకు తీసుకు వెళ్లే విషయంలో అధినేత పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న విధానాన్ని వివరించారు. కులాలకు మతాలకు అతీతంగా సేవా భావాన్ని పెంపొందిస్తూ, పేద వర్గాలకు తోడ్పాటు నందించడమే జనసేన పార్టీ లక్ష్యం అన్నారు. ఆ దిశగా వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్ళు అందించడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ప్రతి గ్రామంలో కూడా వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించే విషయంలో ఓ కార్యాచరణతో ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తోటకూర వెంకట రమణారావు, షేక్ ఇస్మాయిల్, దంతాల కిరణ్, గ్యాలం వేణు, మున్సిపల్ కౌన్సిలర్ మానస రెడ్డి, పార్టీలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గుంటూరులో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ఉత్సాహం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఆదివారం "ఫిట్ ఇండియా – సండేస్ ఆన్ సైకిల్ ర్యాలీ విత్ డిస్ట్రిక్ట్ పోలీస్ ఫోర్సెస్" ఘనంగా జరిగింది. ఉదయం పోలీస్ కార్యాలయం ఆవరణలో ప్రారంభమైన ఈ ర్యాలీని అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు పతాకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సైకిల్‌పై ప్రధాన అతిథిగా పాల్గొని అందరికి ప్రోత్సాహం కల్పించారు. పోలీస్ కార్యాలయం నుంచి బయలుదేరిన ర్యాలీ ఎంటీబీ సెంటర్ వరకు సాగి తిరిగి పోలీస్ కార్యాలయానికి చేరింది. అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున సైకిళ్లపై పాల్గొని ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా ఈ ర్యాలీలో పాల్గొని ఉత్సాహాన్ని మరింత పెంచారు. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం పెంపొందించడం, విధుల్లో చురుకుదనం, మానసిక ఉల్లాసం పెంచడం. అలాగే ఆరోగ్యకర జీవన విధానం ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడం. "ఆరోగ్యకర పోలీస్ – భద్రత గల సమాజం" అనే సందేశాన్ని ఈ ర్యాలీ ద్వారా వ్యాప్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో ముందుండే పోలీస్ దళం ఆరోగ్యంగా, దృఢంగా ఉండటం అత్యంత అవసరమని చెప్పారు. ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాలు సిబ్బందిలో ఆరోగ్య చైతన్యం పెంచి, మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా చేస్తాయని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ సిబ్బంది వ్యాయామం, క్రీడలు, సైక్లింగ్ అలవర్చుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో అదనపు ఎస్పీతో పాటు డీఎస్పీలు అరవింద్, శివాజీ రాజు, ఏడుకొండల రెడ్డి, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్, ఇతర సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజల్లో ఆరోగ్య ప్రాధాన్యతపై చైతన్యం కల్పించడంలో ఈ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## జవాబు దారీతనం, పారదర్శకతను కోల్పోతున్న ఎన్నికల కమిషన్

○ డా. సిహెచ్ దివాకర్ బాబు, న్యాయ కోవిదులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారత ఎన్నికల సంఘం గత దశాబ్ద కాలంగా స్వయం ప్రతిపత్తిని కోల్పోతూ పారదర్శకంగా జవాబు దారీతనంతో వ్యవహరించడం లేదని ప్రముఖ న్యాయ కోవిదులు, సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. హెచ్. దివాకర్ బాబు పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ ఆదివారం రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగం – భారత ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురు దత్ అధ్యక్షత వహించారు. డా. సి. హెచ్. దివాకర్ బాబు ప్రసంగిస్తూ రాజ్యాంగం పై నమ్మకం, విశ్వాసం లేని వాళ్ళు నేడు పాలకులుగా కొనసాగుతూ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. భారత ఎన్నికల కమిషన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆ స్థానంలో మరో కేంద్రమంత్రిని పెట్టడం ద్వారా ఎన్నికల కమిషన్ స్వతంత్రం ను కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. బీహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావిడిగా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా 65 లక్షల ఓట్లను తొలగించడం, ఆధార్ కార్డును పరిగణన లోకి తీసుకోకుండా జనన ధ్రువీకరణ లాంటి పత్రాలను కోరడం హాస్యాస్పదమన్నారు. అత్యధికులు బీహార్ నుండి వలస కార్మికులుగా పలు రాష్ట్రాలకు వలసలు పోతున్న స్థితిని ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకోకపోవడం విచారకరమన్నారు. 2014లో దాదాపు 72 శాతం మంది దేశవ్యాప్తంగా ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయని భావిస్తే నేడు 64 శాతం కు తగ్గిందన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు 50 సంవత్సరాలు పైబడిన వారిలో 90 శాతం మందికి లేవని, మరోవైపు 99 శాతం జనాభాకు ఆధార్ కార్డు అందుబాటులో ఉందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 100 కోట్లకు పైగా ఓటర్లు ఉన్న భారతదేశంలో ఎన్నికల కమిషన్ కు దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సొంత సిబ్బంది ఉండాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛంగా ఉంటే ప్రజాస్వామ్యం వికసిస్తుందని, ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ ఎన్నికల కమిషన్ తీసుకోవాలన్నారు. 130వ రాజ్యాంగ సవరణ అమలులోకి రాకుండా ప్రతి ప్రజాస్వామ్యవాది ఉద్యమించాలన్నారు. గత పది సంవత్సరాలుగా 14 మంది ప్రతిపక్షాలకు చెందిన ముఖ్య మంత్రులు, మంత్రులను అరెస్టు చేశారని, భాజాపాకు చెందిన ఏ ఒక్క మంత్రిని అరెస్టు చేయలేదన్నారు. వేలాది కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టి నేర చరిత్ర గల దాదాపు 25 మందిని బిజెపి పార్టీలోకి చేర్చుకొని వారిని పునీతులను చేసిన ఘనత భాజాపాకే దక్కుతుందన్నారు. ఆధార్ కార్డును ఓటరు కార్డుకు సంధానం చేస్తే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్ ప్రసంగిస్తూ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలగకుండా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి ప్రసంగిస్తూ కాగ్, యూపీఎస్ఎస్సి ,ఎన్నికల కమిషన్ లాంటి రాజ్యాంగ బద్ధ సంస్థలలో అధికార పార్టీల జోక్యం ఉండరాదన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక సంయుక్త కార్యదర్శి డా. టి. సేవా కుమార్, ప్రోగ్రెసివ్ ఫోరమ్ అధ్యక్షులు పి. మల్లికార్జునరావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సిపిఎం నేత నళినీ కాంత్, సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

## షుగరు వ్యాధిగ్రస్తులకు వ్యాయామం అనివార్యం : డాక్టర్ డి. శారద



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** కేవలం మందులపై ఆధారపడకుండా,ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేయడం ద్వారా షుగర్ వ్యాధిని నియంత్రించుకో గలుగుతామని డాక్టర్ డి శారద పేర్కొన్నారు. ప్రతి నెల చివరి ఆదివారం బుర్రిపాలెం వద్ద గల ఎస్. బిల్డింగ్ నందు డాక్టర్ డి శారద సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో, ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 6 గంటలకె వివిధ గ్రామాల నుండి షుగర్ వ్యాధి బాధితులు, శిభిరానికి చేరుకున్న క్రమంలో వారందరికీ, రక్త పరీక్షలు, బీపి, బిఎమ్ పరీక్షలు నిర్వహించి, అల్పాహారం పంపిణీ చేశారు. వైద్య పరీక్షల అనంతరం డాక్టర్ డి శారద షుగర్ వ్యాధిగ్రస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవన శైలిలో వ్యాయామం తప్పనిసరిగా ఉండాలని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, టైప్ టు షుగర్ వ్యాధిగ్రస్తులు పాటించవలసిన నియమాలను వివరించారు. ఆహరంలో, పీచు పదర్థం ఉండే, కూరగాయలు, ఆకు కూరలు, తీసుకోవాలన్నారు. అనంతరం నెలకు సరిపడా అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి3 శారద సర్వీసెస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## బతుకు బండికి వెన్నుదన్ను



○ పేదలకు చేతనైనంతలో సాయమందిద్దాం

○ తోపుడు బండ్లు, విద్యార్థులకు ఆర్థిక సాయం అందించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నిరుపేదలకు అందే చిరుసాయం వారి జీవితాలకు ఆధారంగా నిలుస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరు నగరంలో డీఎస్ నగర్ లో ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. మాజీ కార్పొరేటర్ మాలకొండయ్య సహకారంతో ఒక్కొక్క తోపుడు బండి రూ. 10 వేలు, ఇస్త్రీ బండి రూ. 15 వేలతో సమకూర్చారు. వీటిని లబ్ధిదారులకు అందించిన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల ద్వారా వారి జీవనం సాఫీగా కొనసాగుతుందని తెలిపారు. పేదలకు తన వంతు సాయం అందించాలనే మంచి గుణం కలిగి ఉండటం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల జీవనోపాధి పెంచేందుకు ప్రత్యేకంగా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలో వీధి వ్యాపారులను ప్రోత్సహించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పీ4 కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఒక తోపుడు బండి ద్వారా ప్రతి రోజూ కుటుంబాన్ని పోషించుకునే ఆత్మస్థైర్యం కలుగుతుందని అన్నారు. సాయాన్ని అందుకున్న వీధి వ్యాపారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం రుణాలందించి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చిందని తెలిపారు. మార్ట్ ల ఏర్పాటు ద్వారా మహిళలు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో వేముల శ్రీను, చల్లా ఆంజనేయ ప్రసాద్, వహీద్, వాకా వీరారెడ్డి, రవి, అర్జున్, ముసలయ్య, నరేంద్ర, అచ్చి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక - వినాయక చవితి వేడుక : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**"భక్తి ప్రపత్తులు, సంస్కృతి సంప్రదాయాలకు మాత్రమే కాక సామాజిక చైతన్యానికి ప్రతీక వినాయక చవితి వేడుక" అని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. అందుకే కులమతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఈ పర్వ దినాన్ని సంతోషంగా జరుపుకుంటారని ఆయన వివరించారు. గుంటూరులో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న వినాయక చవితి వేడుకలకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు చవితి పందిళ్ళ వద్ద అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. తొలుత మత సామరస్యానికి అసలు సిసలు నిర్వచనం చాటి చెప్పేలా గుంటూరు కంకరగుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని గాజుల వారి వీధిలో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కరీం లాలా అనే వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ నేత ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని లేళ్ళ అప్పిరెడ్డి సందర్శించారు. అనంతరం బృందావన్ గార్డెన్స్, హౌసింగ్ బోర్డు కాలనీ, హనుమాన్ నగర్ 2వ లైన్, ఏటీ అగ్రహారం 12, 17 లైన్లు, రామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్ళలో కొలువుదీరిన గణనాధులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వినాయక చవితి వేడుకల నేపథ్యంలో వాడవాడల్లో మత సామరస్యం వెల్లి విరుస్తోందని తెలిపారు. ఎక్కడ చూసినా అన్ని వర్గాల ప్రజలు సమిష్టిగా ఈ వేడుకలు జరుపుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇది సమాజానికి ఎంతో శ్రేయస్కరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, ఆయా మండపాల నిర్వాహకులు యడ్లపల్లి సాంబశివరావు, సాయి, మోహన్, వంగా తరుణ్‌కుమార్ రెడ్డి, నాగండ్ల ఓంకారేశ్వరరావు, పసుపులేటి రామకృష్ణ, అరవింద్, లక్ష్మీ, అన్వేష్, రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, రమణయ్య, బొమ్మల నాగరాజు, నూకరాజు, కోటేశ్వరరావు, స్థానిక నేతలు సురసాని వెంకటరెడ్డి, వనజాక్షి, సీతారామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, యర్రం కృష్ణారెడ్డి, పార్టీ నేతలు ఓర్చు శ్రీనివాసరావు, పరిశపోగు శ్రీనివాసరావు, పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, కౌండిన్య తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధిబుద్ధిగణపతి లక్షగరికలంతో అర్చన



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సర్వవిఘ్నములకు అధిపతి అయిన సిద్ధిబుద్ధి గణపతికి పెనుగొండ శ్రీ వాసవి పీఠం పీఠాధిపతులు శ్రీ ప్రజ్ఞనంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో ఆదివారం లక్ష గరికలతో అర్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని కిరాణం మర్చంట్స్ అసోసియేషన్ భవన సముదాయంలో శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న అర్ధ రాత్రి మాస దీక్ష, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలలో భాగంగా, సిద్ది బుద్ధి గణపతికి విద్యార్థినీ విద్యార్థుల చేత గరికతో లక్ష గరిక అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం, శ్రీ సాలిగ్రామ మఠం సంయుక్త నిర్వహణలో కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, విశేషంగా మహిళా భక్తులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## నిజం నిద్ర లేచే లోపు లోకాన్ని చుట్టి వస్తున్న అబద్ధం : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

○ దుష్ట పాలనపై సెల్ ఫోన్ ఆయుధంగా సోషల్ మీడియా యుద్ధం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు కళ్ళకు కట్టినట్లు వివరించడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. "నిజం నిద్ర లేచే లోపు అబద్ధం లోకాన్ని చుట్టివస్తున్న గడ్డు కాలం! సంక్షేమాన్ని అటకెక్కించి రాష్ట్రాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేందుకు కూటమి ప్రభుత్వం శతవిధాలా కుట్రలు పన్నుతున్న కలికాలం!!" ఈ నేపథ్యంలో నిజాన్ని బతికించడం కోసం.. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం.. దుష్ట పాలన అంతానికై నిస్వార్థంగా తమ సెల్ ఫోనునే ఆయుధంగా మలచుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సాగిస్తున్న యుద్ధం అనిర్వచనీయమని ఆయన అభినందించారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా నియమితులైన రమేష్ సాహు శనివారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా విభాగం వెన్నెముక వంటిదని వ్యాఖ్యానించారు. ఎన్ని కష్టాలు పడినా.. మరెన్ని కేసులు పెట్టినా.. మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్న నిజమైన జగనన్న వారియర్స్ సోషల్ మీడియా సైన్యమని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం విపరీతంగా పెరిగిందని లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తన అనుకూల మీడియా ద్వారా అవాస్తవాలను అత్యంత వేగంగా ప్రచారం చేస్తున్న తరుణంలో.. దాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టేందుకు మనకున్న ఏకైక సాధనం సోషల్ మీడియా అని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు, జగన్ హయాంలో విద్య, వైద్యం, మహిళా సాధికారత, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, రైతు భరోసా కేంద్రాలు, అన్నిటినీ మించిన సచివాలయాల వ్యవస్థతో రాష్ట్రం ఎంతో సర్వతోముఖాభివృద్ధి సాధించిన వాస్తవాన్ని కూడా ప్రజలకు గుర్తు చేయాలని ఆయన కోరారు. తద్వారా పార్టీని మరింతగా ప్రజలకు చేరువ చేయడంలో సోషల్ మీడియా ప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు.

రాష్ట్రం కోసం, ప్రజల కోసం ప్రతి క్షణం జగనన్న కష్టపడుతున్నారని లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ఈ క్రమంలో దుష్ట పాలకుల గుండెల్లో సింహ స్వప్నంగా మారిన వైయస్ జగన్‌కు మనం అందరం అండగా నిలవాలన్నారు. మన కోసం కాదు... మన పార్టీ కోసం కాదు... మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ కోసం కాదు... రాష్ట్రం కోసం, రాష్ట్ర ప్రజల కోసం, మళ్ళీ వైసీపీని అధికారంలోకి తేవాలన్న ఏకైక లక్ష్య సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు వలివేటి వెంకటరమణ, షేక్ రబ్బానీ, యాదాల చిన్న, కౌండిన్య, సుబ్బరాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

## మహా గణపతి ఆశీస్సులతో మరింత అభివృద్ధి దిశగా గుంటూరు పశ్చిమ



○ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు ఆదివారం రోజు నియోజకవర్గంలో పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భక్తులకు స్వయంగా అన్నదానం వడ్డించారు.
ప్రధానంగా 38వ డివిజన్ బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్, 39వ డివిజన్ మారుతి నగర్, గుజ్జనగుండ్ల సెంటర్, ఉద్యోగ నగర్ తదితర ప్రాంతాల్లోని గణపతి మండపాల్లో ఎమ్మెల్యే గారు పూజలు చేశారు. అనంతరం బృందావన్ గార్డెన్స్, గుజ్జనగుండ్ల సెంటర్, 31వ డివిజన్ ఏటి అగ్రహారం జీరో లైన్, 30వ డివిజన్ ఏటి అగ్రహారం 7వ లైన్‌లలో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ "నియోజకవర్గంలో జరుగుతున్న శుభ్రతా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజల జీవితాలను మెరుగుపరుస్తున్నాయి. గణపతి ఆశీస్సులతో గుంటూరు పశ్చిమ మరింత ముందుకు సాగుతుంది" అని పేర్కొన్నారు.

## ఉత్సవాలు సామరస్యానికి ప్రతీక



○ వినాయక మండపాలను దర్శించుకున్న ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఉత్సవాలను సామరస్యానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మండపాలను ఆదివారం ఎమ్మెల్యే నసీర్ దర్శించుకున్నారు. ఆయా మండపాల వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటు ద్వారా ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. ఒక వీధిలో వారు తామంతా ఒకటేననే భావన కలుగుతుందని చెప్పారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నారని అన్నారు. వినాయక నిమజ్జన సమయంలో ఎంతో సమన్వయంతో వ్యవహరించాలని, యువత క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అప్పుడే సంబరాలను ఆనందంగా నిర్వహించుకోగలుగుతారని చెప్పారు.

## హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు కేసు విషాదాంతం

**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):** అదృశ్యమైన ఏలూరు జిల్లాకు చెందిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ బి. సుబ్బారావు కేసు విషాదాంతంగా ముగిసింది. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి వద్ద ఎర్రకాల్వలో మృతదేహం లభ్యమైంది. సుబ్బారావుది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసుల విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే, చివరిసారిగా హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు ఫోన్ సిగ్నల్ అటవీ ప్రాంతంలో పోలీసులు గుర్తించారు. సుబ్బారావు ద్వి చక్ర వాహనం టీ. నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం వద్ద ఎర్రకాలువలో దొరికినట్లు సమాచారం. కామవరపుకోటకు చెందిన ఒక యువకుడిని అదుపులోకి తీసుకొని తడికలపూడి పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం



○ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాలు మారినా ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఇంకా దూరంగానే ఉందని, నాటి ప్రభుత్వంలోనైనా, నేటి ప్రభుత్వంలోనైనా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాష ఆక్షేపించారు.
చాంద్ బాష మాట్లాడుతూ – "నాటి ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు తీవ్రంగా మోసపోయారు. ఎవరు అడగకముందే 27 శాతం ఐఆర్ ఇచ్చినా, రివర్స్ పీఆర్సీ ద్వారా కేవలం 23 శాతం ఫిట్‌మెంట్ మాత్రమే అమలు చేశారు. అంతేకాకుండా పెండింగ్‌లో ఉన్న రూ. 25 వేల కోట్ల బకాయిలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించకుండా మోసం చేసిన ఘనత ఆ ప్రభుత్వానిదే" అని వ్యాఖ్యానించారు.
నేటి ప్రభుత్వంలోనూ ఉద్యోగుల సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పటి వరకు ఉద్యోగుల సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం, పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండా కాలయాపన చేయడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది. నేటి ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఐఆర్ లేదు, డీఏలు లేవు, పెండింగ్ బకాయిల చెల్లింపుపై ఎలాంటి చర్చ లేదు. సీపీఎస్,జీపీఎస్ లపై కూడా ఇప్పటివరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కమిటీ సైతం లేని పరిస్థితి నెలకొంది" అని చాంద్ బాష తీవ్రంగా విమర్శించారు.
"ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపే చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతుంది" అని జిల్లా అధ్యక్షులు హెచ్చరించారు.
ఉద్యోగుల సమస్యలపై చర్చను విస్తరించడానికి "టీ తాగుతూ మాట్లాడుకుందాం" అనే వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమం తాలూకా స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతంగా నిర్వహించామని, ఉద్యోగుల్లో దీనికి మంచి స్పందన లభించిందని వివరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాద్రి, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, నగర శాఖ కార్యదర్శి బి. ఈశ్వర్ ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద రత్తయ్య, ఉపాధ్యక్షులు నాగారాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డుల పంపిణీలో కూటమి నేతలు

○ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** మండలంలోని నందివెలుగు గ్రామంలో,క్యూఆర్ ఆధారిత, కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల, పంపిణీ కార్యక్రమాన్ని, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ల, సంయుక్త ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించారు.
మండలంలోని నందివెలుగు గ్రామంలో ఆదివారం క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ పండుగ వాతావరణన్ని తలపించింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ముగ్గురు నాయకుల కలయికలో, కోలాహల వాతావరణం, నడుమ ప్రతి ఇంటికి వెళ్లి వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు, స్మార్ట్ రేషన్ కార్డులను నాయకులు అందజేశారు. కార్డు వినియోగం గురించి వివరించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లభించే వివరాలను వెల్లడించారు. వెబ్ లింకు ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు,ఈ కేవైసీ స్థితి,రేషన్ పంపిణీ చేయు వారి వివరాలు, రేషన్ తీసుకునే వారి వివరాలు కులంకషంగా తెలుస్తాయని అన్నారు. అనంతరం జరిగిన సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు తీసుకురావడంలో మంత్రి నాదెండ్ల మనోహర్ కృషిని ప్రశంసించారు. పేద ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉండాలన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రేషన్ షాపులు,నెల రోజులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న, దుష్ప్రచారాన్ని, ప్రజలే తిప్పి కొట్టే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో రేషన్ షాపుల ద్వారా రాగులు, వంటనూనె, గోధుమపిండి, కందిపప్పు వంటి సరుకులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలందరికీ జవాబుదారీగా పనిచేస్తున్న ప్రభుత్వమని అన్నారు. పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఆర్థిక భారం పడుతున్న సూపర్ సిక్స్ పథకాలను ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్నారని వివరించారు. రేషన్ పంపిణీ విధానంలో కూడా వృద్ధులకు, ఇంటి నుండి బయటకు రాలేని వారికి, ముందస్తుగా నేరుగా ఇంటికి తీసుకువెళ్లి రేషన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు.
ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ,తాహశీల్దార్ కె వి గోపాలకృష్ణ, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు,గ్రామ స్థాయి, మండల స్థాయి,కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం

○ అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య (ఎ ఐ పి టి ఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశం ఆగస్టు 30, 31 తేదీల్లో పుదుచ్చేరిలోని అభిరామ్ రెసిడెన్సీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. జాతీయ అధ్యక్షుడు బసవరాజ్ గురికర్ అధ్యక్షతన, జాతీయ సెక్రటరీ జనరల్ కమల్కాంత్ త్రిపాఠి పర్యవేక్షణలో సమావేశం కొనసాగింది. పాండిచ్చేరి విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం, పర్యాటకాభివృద్ధి మరియు పబ్లిక్ వర్క్స్ మంత్రి కె. లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఏ జి ఎస్ గణపతి రావు, ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు పాల్గొన్నారు. భారతదేశంలోని 24 రాష్ట్రాల నుండి ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరై చర్చల్లో పాల్గొన్నారు.
సమావేశంలో ముఖ్యంగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని దేశవ్యాప్తంగా పునరుద్ధరించే వరకు పోరాటాన్ని కొనసాగించాలనే తీర్మానం ఆమోదం పొందింది. అలాగే ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక పేరివిజన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, విద్యేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించి బోధనపైనే దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం విద్యార్థి%-%ఉపాధ్యాయుల నిష్పత్తిని కచ్చితంగా అమలు చేయాలని, జిడిపిలో 12 శాతం విద్య కోసం కేటాయించాలని కూడా నిర్ణయించారు.
అలాగే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలనీ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయుల సంఖ్యను ప్రతి రాష్ట్రానికి కనీసం ఐదుగురికి పెంచాలని సమావేశం అభిప్రాయపడింది. ఈ తీర్మానాలతో కూడిన వినతిపత్రాన్ని 15 రోజుల్లోగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యక్తిగతంగా అందజేయాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించింది.
ఈ తీర్మానాల అమలుకు ఆందోళనల దిశగా కార్యాచరణ ప్రణాళికను సమాఖ్య రూపొందించింది. సెప్టెంబర్ 5 నుండి అక్టోబర్ 5 మధ్యలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందజేయనున్నారు. నవంబర్ 22న మండల కేంద్రాల్లో, నవంబర్ 29న జిల్లా కేంద్రాల్లో, డిసెంబర్ 30న రాష్ట్ర రాజధానిలో ధర్నాలు నిర్వహించనున్నారు. చివరిగా జనవరి 31న ఢిల్లీలో జాతీయ స్థాయి ధర్నా చేపట్టాలని సమాఖ్య నిర్ణయించింది. ఈ విషయాలను ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఏ జి ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు పుదుచ్చేరి నుండి పత్రికలకు తెలియజేశారు.

## విఘ్న వారణం - విశ్వ కారణం



○ విఘ్న నాయకుడికి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి విశిష్ట పూజలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** "సమస్త వేదాలకు మూలమైన ఓంకార రూపం.. సకల దేవతా సమిష్టి స్వరూపం.. సర్వ విఘ్న సంహారం.. మహా గణపతి అవతారం" అని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే ఆయన అనాదిగా "విఘ్న వారణం – విశ్వ కారణం" అంటూ విశ్వ జనులచే విశిష్టమైన ఆది పూజలు అందుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.
గుంటూరులో వినాయక చవితి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నెలకొల్పిన ప్రత్యేక మండపాలలో అనేక రూపాలలో కొలువైన బొజ్జ గణపయ్యను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి దర్శించుకున్నారు. అ-రండల్‌పేటలో బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి నేతృత్వంలో పరిహార్ యూత్ గణేష్ ఉత్సవ్ సర్కిల్, కొరిటపాడులో కార్పొరేటర్ యక్కల మారుతీ కోటి లింగారెడ్డి నేతృత్వంలో కొరిటపాడు యూత్, నెహ్రూనగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్, శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్, ఆర్టీసీ కాలనీలో కార్పొరేటర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శేషగిరి పవన్‌కుమార్ నేతృత్వంలోని కార్మిక సంక్షేమ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్, ఆర్ అగ్రహారంలో వైసీపీ నేత టీఎల్వీ వీరాంజనేయులు ఆధ్వర్యంలో, ఏటీ అగ్రహారంలో కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, శ్రీరామ్ నగర్‌లో షేక్ రోషన్ నేతృత్వంలో స్థానికులు ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వమే గణేశ తత్వమని పేర్కొన్నారు. సర్వత్రా సమంగా వ్యాపించిన ఏకీకృత చైతన్యమే ఏకదంత వినాయకుడని తెలిపారు. అందరూ సమదృష్టిని అలవరచుకోవాలని చెప్పే సమిష్టి తత్వం అదేనన్నారు. వ్యక్తిలో శక్తిని, వ్యవస్థలో స్ఫూర్తిని నింపే సద్గుణ గణాలకు అధిపతి గణపతి అన్నారు. విఘ్నాన్నే ఆయుధంగా ప్రయోగించి ఏ కార్యాన్నైనా సానుకూలం చేయగల విజ్ఞుడు విఘ్న నాయకుడని లేళ్ళ అప్పిరెడ్డి వివరించారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డితో పాటు షేక్ మస్తాన్‌వలి, గులాం రసూల్, బత్తుల దేవానంద్, పానుగంటి చైతన్య, షేక్ రబ్బానీ, యర్రం కృష్ణారెడ్డి, కౌండిన్య, రేజేటి నవీన్, సుబ్బరాజు, వార్డు అధ్యక్షుడు రామదాస్, సిద్దుల శ్రీనివాసరావు, కోటి, వనజాక్షి, సీతారామిరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా 'ఆప్టా గణపతి రావు'కు సత్కారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యుల రెండు రోజుల సమావేశం శనివారం పుదుచ్చేరి అభిరామ్ హోటల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతి రావుకు ఘన సత్కారం జరిగింది.
ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఏజీఎస్ గణపతి రావు, ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రకాష్ రావు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం గత నాలుగేళ్లలో తమ రాష్ట్ర విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన మార్పులను వివరించారు. ఎస్జిటి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించడం పాండిచ్చేరి విద్యా విధానంలో విశేషమని గణపతి రావు అభిప్రాయపడ్డారు. జాతీయస్థాయిలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మిర్చి పేరుతో పాఠశాలలను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని సమావేశంలో తీర్మానించారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక విజన్ కమిషన్ నియమించాలని, ఉపాధ్యాయులకు క్యాష్‌లెస్ మెడికల్ సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. అదనంగా మిడ్ డే మీల్ ఖర్చును పెంచాలని, జాతీయ ఆదాయంలో ఆరు శాతం విద్య కోసం కేటాయించాలని సభలో తీర్మానం ఆమోదం పొందింది. ఈ తీర్మానాలను వచ్చే వారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సమర్పిస్తామని అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు బసవరాజు గురుకర్, సెక్రటరీ జనరల్ కమలకాంత్ త్రిపాఠి వెల్లడించారు.

## నంద్యాల మీదుగా తిరుపతికి వారాంతపు ఎక్స్ ప్రెస్ రైలు : ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**నంద్యాల(జర్నలిస్ట్ ఫైల్):** నంద్యాల రైల్వే స్టేషన్ మీదుగా తిరుపతి పుణ్య క్షేత్రంకు తెలంగాణ రాష్ట్రం చర్లపల్లి నుంచి తిరుపతి, మళ్ళీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి నుండి చర్లపల్లికి స్పెషల్ ఎక్స్ ప్రెస్ రైలు సెప్టెంబర్ 9 వ తేదీన ప్రారంభమౌతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఆదివారం తెలిపారు.
తన అభ్యర్థన మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రయాణికుల రద్దీ కారణంగా వారంతపు చర్లపల్లి బి తిరుపతిబిచర్లపల్లిస్పెషల్ ఎక్స్ప్రెస్ సెప్టెంబర్ నెలలో 9 వ తేదీ నుండి నవంబర్ 25 వ తేదీ వరకు రైలు నెంబర్ 07013 ప్రతి మంగళవారం చర్లపల్లి లో రాత్రి 9:10 గంటలకు బయలుదేరి నల్గొండ, పిడుగురాళ్ళ, మార్కాపురం, గిద్దలూరు మీదుగా నంద్యాలకు బుధవారం ఉదయం 5:30 గంటలకు వచ్చి, మళ్ళీ 5:35 గంటలకు తిరుపతికి కోవెలకుంట్ల మీదుగా వెళుతుందనీ, రైలు నెంబర్ 07014 తిరుపతిబి చర్లపల్లి మళ్ళీ తిరుపతిలో ప్రతి బుధవారం సాయంత్రం 4:40 గంటలకు బయలుదేరి నంద్యాలకు రాత్రి 10:25 గంటలకు చేరుకొని చర్లపల్లికి బయలదేరి గురువారం ఉదయం 8:00 గంటలకు చేరుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలో మొత్తం 12 ట్రిప్పులు ఈ ప్రత్యేక వారాంతపు రైలు తిరుగుతాయని, ఈ స్పెషల్ ఎక్స్ ప్రెస్ లు ఏర్పాటు చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ధన్యవాదములు తెలిపారు. నంద్యాల పార్లమెంట్ లోని రైలు ప్రయాణికులు ఈ వారంతపు స్పెషల్ ఎక్స్ప్రెస్ లను ఉపయోగించాలనిఆమె కోరారు.

## 7న సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు



**కృష్ణా జిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** కృష్ణా జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7వ తేదీన జిల్లా సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి డి. దిలీప్ కుమార్ తెలిపారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో 7వ తేదీ ఉదయం 7 గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లు సెప్టెంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటాయని తెలిపారు.

## ఐఆర్ పిఎఫ్ఎస్ అధికారి మధుసూదనరావుకు ఘనంగా వీడ్కోలు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) శాఖలో మధుసూదనరావు అందించిన సేవలు సాటిలేనివని ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్ షణ్ముగం వడివేలు పేర్కొన్నారు. ఆదివారం పట్టాభిపురంలోని డి. ఆర్. ఎం కార్యాలయంలో జరిగిన డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ గోళ్లమూడి మధుసూదనరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దీనికి అసిస్టెంట్ కమిషనర్ శైలేష్ కుమార్ అధ్యక్షత వహించారు. వడివేలు మాట్లాడుతూ.. శాఖ పరంగా మధుసూదనరావు కు దక్కినన్ని అవార్డులు, రివార్డులు మరే అధికారికి దక్కలేదన్నారు. మధు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ యేడాది ఆయనకు రాష్ట్రపతి పోలీస్ మెడల్ లభించటం శాఖకు గర్వ కారణమన్నారు. డిప్యూటీ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి. తోకల మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సమర్థత, విశ్వసనీయత, దక్షత ఉంటే ఏ అధికారైనా తప్పక రాణిస్తారన్నారు. డిపార్ట్మెంట్ లో మధుసూదనరావు తన శక్తిమేర పనిచేసి మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. రిటైర్డ్ అధికారి మధుసూదనరావు మాట్లాడుతూ..కష్టపడితే ఏదైనా సాధించవచ్చునన్నారు. ఉద్యోగులు అందించిన సహకారం మరువలేనన్నారు. విధి నిర్వహణలో మధుసూదనరావు చూపిన ప్రతిభ, నైపుణ్యాన్ని వివిధ ఉద్యోగులు ప్రశంసించారు. ఈ సందర్భంగా మధుసూదన రావును పెద్ద ఎత్తున సన్మానించారు. అనంతరం మధుసూదనరావు దంపతులను మేళతాళాలతో టాపు లేని జీపులో ఊరేగించి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి ఎఫ్ అధికారులు శైలేష్, పవన్ సింగ్, చెంచయ్య, మద్రి సాంబశివరావు, అక్కేశ్వరరావు, మురళికృష్ణ, రవిశంకర్, చంద్రశేఖర్, దుర్గా ప్రసాద్, నారాయణ కుటుంబ సభ్యులు గోళ్లమూడి భాస్కరరావు, శ్రీనివాస్, సుశీల, బోడెపూడి అనిల్, జ్యోతి, గుమ్మడి సుబ్బారావు, భార్గవి పాల్గొన్నారు.



## సచివాలయ ఉద్యోగులను కించపరుస్తున్న ప్రభుత్వం

○ రాష్ట్ర గ్రామ-వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు సచివాలయ ఉద్యోగులను అవమానపరుస్తున్నాయని రాష్ట్ర గ్రామ%-%వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ మండిపడ్డారు. ఇంటింటికీ రేషన్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు సచివాలయ ఉద్యోగులను కించపరచడమేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. రజాక్ మాట్లాడుతూ, అధికారులు ఇస్తున్న స్పష్టతలేని ఆదేశాలు ఉద్యోగులను గందరగోళానికి గురిచేస్తున్నాయని, ప్రజా సేవల కోసం ఎంపికైన ఉన్నత విద్యావంతులైన సిబ్బందిని రేషన్ పంపిణీ పనిలో నిమగ్నం చేయడం వారి గౌరవాన్ని తగ్గించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీలు, పీహెచ్డీలు చేసిన అర్హత కలిగిన సిబ్బందిని నియమించి ప్రత్యేకంగా గ్రామ-వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, కానీ ఇప్పుడు వారిని అసలు బాధ్యతలకు విరుద్ధంగా రేషన్ సరఫరా వంటి పనులకు మళ్లించడం తగదని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలనే ఉద్దేశంతో సచివాలయ ఉద్యోగులు ఎన్నో కష్టాలు భరిస్తూ పనిచేస్తున్నారని, అయితే ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వారి ప్రతిష్టను దెబ్బతీయడమేనని రజాక్ అభిప్రాయపడ్డారు. గ్రామ, వార్డు స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రధాన పాత్ర పోషిస్తున్న సచివాలయ ఉద్యోగులను తక్కువ చేసి చూడరాదని హెచ్చరించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో వారి ప్రతిభ, నైపుణ్యాలను సమర్థవంతమైన పరిపాలనకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు నేరుగా ముడిపడని పనులను ఉద్యోగులపై మోపడం వలన ఇతర సేవలు దెబ్బతింటాయని రజాక్ పేర్కొన్నారు. ఉద్యోగులను గౌరవించే విధంగా వ్యవస్థను నడపాలని, సచివాలయాలను పరిపాలనా కేంద్రాలుగా నిలబెట్టాలని రజాక్ డిమాండ్ చేశారు. ఇంటింటికీ రేషన్ సరఫరా పనులను సంబంధిత శాఖల సిబ్బందితోనే నిర్వహించాలని, సచివాలయ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా వెంటనే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467